
# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



# పల్నాడు జిల్లా వార్తలు

5

సోమవారం 3 నవంబరు 2025




వర్షాలకు ఉరకేత్తి వడలిపోతున్న పత్తి చేను

# ఆక్రమణలో.. ఆనవాళ్లు

- ఘనకీర్తికి మారుపేరుగా మందడం, మల్కాపురం
- సజీవ శిలాజాలుగా శివాలయం, నందిశాసనం, కోనేరు
- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ప్రజల వేడుకోలు



గణపతిదేవుని ఆధ్వర్యంలో విశ్వేశ్వర శంభు నిర్మించిన శివాలయం

**శౌర్యానికి.. ధైర్యానికి ప్రతీకగా నిలిచే రాణి రుద్రమదేవి అంటే నేటికీ తెలుగునాట ఘనకీర్తి. రాజధాని అమరావతితో కాకతీయల రాణికి ప్రత్యేక అనుబంధం ఉంది. అమరావతి భూభాగంలో ఆమె ఎన్నోసార్లు నడయాడారు. కాకతీయ సామ్రాజ్యం పాలనా పగ్గాలను చేపట్టడానికి ముందునుంచే రుద్రమదేవి తండ్రి గణపతి దేవునితో కలిసి తరచుగా మల్కాపురం వచ్చిపోతుం డేవారు. ఈ ప్రాంతంలోని ఓ కొలనంటే ఆమెకు ఎంతో మక్కువ. ఆ కొలను ఒడ్డున కూర్చొని సేదతీరేవారు. ఈ ప్రాంతంపై తనకున్న ప్రేమాభిమానాల కొద్దీ ఆమె తన జన్మదినోత్సవాన్ని ఇక్కడే ఎంతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఇక్కడి మహిళల గర్భకోశ వ్యాధుల చికి త్సల కోసం ఏకంగా ఓ ప్రసూతి వైద్యశాలనే ఆమె కట్టిం చారు. రాణీ రుద్రమదేవిని అంతగా ఆకట్టుకున్న ఆ ప్రదేశమే నేటి మల్కాపురం. రుద్రమదేవి తాలూకు ఆనవాళ్లు ఇప్పటికీ అక్కడ కనిపిస్తూనే ఉన్నాయి. అయితే ఆ ఆనవాళ్లు నేడు ఆక్రమణలకు గురయ్యాయి. వీటిని పట్టించుకునేవారు లేరు. ఘన చరిత్రకు ఆనవాళ్లుగా ఉన్న ఈ ప్రాంతాన్ని రాష్ట్రప్రభుత్వం గుర్తించి, రుద్రమదేవి తాలూకు ఆనవాళ్లను పరిరక్షించి దీనినో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.**



## అమరావతిలో రుద్రమదేవి గుర్తులు శిథిలం

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

రుద్రమదేవి చరిత్ర తెలంగాణకే కాదు.. యావత్ తెలుగుప్రాంతానికంతా సుపరిచితమే. వరంగల్ కేంద్రంగా ఆమె పాలన కొనసాగినప్పటికీ నేటి రాజధాని అమరావతి ప్రాంతం కూడా అప్పట్లో ఆమె ఏలుబడిలోనిదే. రుద్రమదేవి తండ్రి గణపతిదేవుని కాలం నుంచే ఈ ప్రాంతంలో కాకతీయులకు అనుబంధం ఉండేది. తనకు రాజగురువుగా కొనసాగిన విశ్వేశ్వర శంభు అనే శివాచార్యునికి ఈ ప్రాంతాన్ని బహుమతిగా ఇచ్చారు గణపతిదేవుడు. రాయపూడి మొదలు పెనుమాక వరకు ఉన్న పదికిపైగా గ్రామాలను ఈ విశ్వేశ్వరశంభుకు అప్పగించారు. నాలుగు గొప్ప రాజవంశాలకు రాజగురువుగా వ్యవహరించారు. కృష్ణానది ఉత్తరవాహినిగా ఉన్న ఈ ప్రాంతాన్ని కాకతీయ చక్రవర్తి విశ్వేశ్వరశంభుకు అప్పగించారు. మల్కాపురంలో విశ్వేశ్వరశంభు గోళకీమఠాన్ని స్థాపించారు. గోళకీ మఠం అంటే శివాలయం. వేదవిద్యతో కూడిన మహా విద్యాలయ సముదాయం. అప్పట్లో ఈ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల సందర్భంగా పదిమంది నృత్యకళాకారిణులు నాట్యం చేస్తుండేవారు. 14 మంది మహిళా గాయకురాండ్రు, వివిధ రకాల వాయిద్యాలను వాయిస్తూ మరో 16 మంది సంగీత కళాకారులు ఉండేవారు.. అర్చనల నిమిత్తం ఆరుగురు, ఆలయ నైవేద్యాల కోసం మరో ఇద్దరు బ్రాహ్మణులు ప్రత్యేకంగా ఉండేవారు. వీరభద్రుల పేరిట పది గ్రామాల ను సంరక్షించడానికి 73 మందితో కూడిన ప్రత్యేక సైనికదళం (మిగతా 7లో)



మల్కాపురంలో రాయ గజకేసరి రాణీ రుద్రమదేవి వేయించిన శిలాశాసనం

## ఘనంగా రుద్రమా జయంత్యుత్సవం

1261 మార్చి 25న రుద్రమదేవి తన జన్మదినోత్సవాన్ని మల్కాపురంలోని గోళకీమఠంలో ఎంతో వైభవంగా జరుపుకు న్నారు. ఆ సందర్భంగా శివాలయానికి తూర్పు దిక్కుగా ఓ భారీ శిలాశాసనాన్ని వేయించారు. అది ఇప్పటికీ చెక్కుచెదర కుండా ఉంది. దీనిని నంది శాసనమమని, నాగశాసనమని వ్యవహరిస్తుంటారు. ఈ శాసనంపై ఆలయం వైపు నంది విగ్రహం.. మరోవైపు పడగవిప్పి సర్పం చెక్కబడి ఉండటమే ఇందుకు కారణం. దీనిపై నాటి జయంత్యుత్సవాల నిర్వహణ, చేసిన దానాల గురించి విపులంగా తెలుగు, సంస్కృత భాషల్లో లిఖించారు. ఈ సందర్భంలోనే రుద్రమదేవి ఆలయానికి తూర్పు ఈశాన్యంగా ఓ కోనేరును తవ్వించడంతోపాటు మంద డం పరిధిలో ఓ ప్రసూతి వైద్యశాలను ఏర్పాటు చేయించారు. అప్పట్లో గర్భిణులు సుఖప్రసవాలు లేక మృత్యువాత పడు తుండడాన్ని చూసి రుద్రమదేవి ఎంతగానో చలించిపోయి ఈ ప్రసూతి వైద్యశాలను అన్ని సదుపాయాలతో ఏర్పాటుచేయిం చారు. ఈ ప్రస్తావన కూడా ఆ శాసనంలో ఉంది. తాను సామ్రాజ్ఞిగా పట్టాభిషక్తురాలైన తర్వాత కూడా రుద్రమదేవి ఇక్కడికి ఎన్నోమార్లు వచ్చారు. తాను నిర్మించిన కోనేరు ఒడ్డున కూర్చొని సేదతీరుతుండడం ఆమెకు ఇష్టమైన అలవాటుగా ఉండేదంటారు. 1289లో జరిగిన ఓ మహాసంగ్రా మంలో రుద్రమదేవి వీరమరణం పొందిన తర్వాత కూడా చాలాకాలం ఈ ప్రాంతం గొప్పగానే వెలుగొందుతూ వచ్చింది.

# బీమా ఆదుకునేనా?

- పంటలకు అపార నష్టం
- 33 శాతం దాటితేనే పరిగణనలోకి
- నిబంధనలు సడలించాలని కోరుతున్న రైతులు
- జిల్లాలో 55,935 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

వర్షాభావం.. భారీ వర్షాలు.. తెగుళ్ల.. రైతులను నిండా ముంచుతున్నాయి. ప్రస్తుతం చేతికి అందివచ్చిన పంటలను మొంథా ముంచేసింది. దీంతో పంటలకు అపార నష్టం వాటిల్లింది. జిల్లాలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వేలాది రూపాయలు పెట్టుబడులతో సాగు చేసిన పంటలు వర్షార్పణంతో రైతులు కోలుకోలేని విధంగా నష్టపోయారు. 55,935 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా తేల్చారు. రైతులకు రూ.90 కోట్లకుపైగా నష్టం వాటిల్లిందని అంచనా. పత్తి 43,750 ఎకరాల్లో, వరి 2,500, మొక్కజొన్న 875, కంది 450, మినుము 200, జూట్ 200 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ లెక్క కట్టింది. ఆయా పంటలకు ఎంత లేదన్నా నష్టం రూ.10 కోట్ల వరకు ఉంటుందని అంచనా. మిరప, కూరగాయలు, బొప్పాయి, అరటి తదితర పంటలకు 5,208 ఎకరాల్లో రూ.12.85 కోట్లు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అంచనా వేసింది. ఈ పరిస్థితుల్లో బీమా పథకాలు ఆదుకుంటాయా లేదా అన్న సందేహాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు. పొలంలోని పంట 33 శాతానికి పైగా దెబ్బతింటేనే నష్టం జరిగినట్లుగా వ్యవసాయ, ఉద్యాన శాఖలు గుర్తించాయి. ఈ నిబంధనల వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. నిబంధలను సడలించి నష్టపోయిన వారందరికీ ప్రభుత్వం పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద వేలాది మంది రైతులు ప్రీమియం చెల్లించారు. ఫసల్ బీమా పథకం కింద జిల్లాలో 31,516 మంది రైతులు 36,675 ఎకరాలకు ప్రీమియం చెల్లించినట్లు వ్యవసాయ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. జిల్లాలో పత్తి పంటకు వాతావరణ ఆధారిత పంట బీమా పథకం అమల్లో ఉంది. ఈ పథకానికి సుమారు 2వేల మంది ప్రీమియం చెల్లించి పంట నమోదు చేసుకున్నారు. ఈ రెండు బీమా పథకాల కింద రైతులకు పరిహారం అందాల్సి ఉంది. బీమా పరిహారం త్వరిత గతిన అందించాలని రైతులు కోరుతున్నారు. రైతులకు అవగాహన లేక పోవడంతో అందరూ బీమా చెల్లించలేదు. బీమా చెల్లించని రైతులకు ప్రభుత్వం ప్రత్యేకంగా పరిహారం చెల్లించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రమాదకరంగా..

# లోలెవల్ చప్టాలు

**వర్షాల సమయంలో రాకపోకలు బంద్**

దాచేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ మోస్తరు వర్షాలతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో లోలెవల్ చప్టాలు ప్రమాదకరంగా మారాయి. నడికూడిలోని నల్లవాగుపై రెండు లోలెవల్ చప్టాలు ఉన్నాయి. కేసానుపల్లి, దాచేపల్లి మధ్యలో, దాచేపల్లి నుంచి మాదిన పాడు మధ్యలోని చప్టాలపై నల్లవాగు, కంజులవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.



నడికూడి వద్ద లోలెవల్ చప్టాపై నుంచి ప్రవహిస్తున్న నల్లవాగు

దీంతో వర్షాల సమయంలో ఈ మార్గాల్లో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దాచేపల్లి, మాదినపాడు రోడ్డులోని కంజు లవాగు ప్రవాహంతో కొత్తూరు, సారంగపల్లి అగ్రహారం, మాదినపాడు గ్రామాలకు రాకపోకలు ఉం డటంలేదు. నడికూడి రైల్వేస్టేషన్, నడికూడి మధ్యలో ప్రవహించే నల్లవాగుతో రైల్వే ప్రయాణికు లకు, స్థానిక ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. రాళ్లవాగు పొంగి ప్రవహించే సమయంలో పెదగార్లపా డు, తక్కెళ్ళపాడు, కేసానుపల్లి, దాచేపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

# మైనింగ్ రాయల్టీ వసూళ్లపై నిరసన

**● యడవల్లి వద్ద గ్రానైట్ యజమానుల ఆందోళన**



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న గ్రానైట్ సంస్థల యజమానులు


చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏఎంఆర్ సంస్థ అక్రమంగా మైనింగ్ రాయల్టీ వసూళ్లను నిరసిస్తూ గ్రానైట్ యజమానులు రోడ్డెక్కారు. ఆదివారం చిలకలూరిపేట కోటప్ప కొండ మార్గంలో యడవల్లి గ్రామం వద్ద బాపట్ల, ప్రకాశం, పల్నాడు జిల్లాలకు చెందిన గ్రానైట్ వ్యాపారులు, యజమానులు, కార్మికులు రాస్తారోకో చేశారు. సుమారు గంటన్నర సేపు రహదారిపై రాకపోకలను అడ్డుకున్నారు. రాయల్టీ వసూళ్లలో ఏఎంఆర్ సంస్థ తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రెట్టింపు మొత్తాన్ని రసీదులు లేకుండా మైనింగ్ రాయల్టీగా వసూలు చేస్తుందని వాపోయారు. ఏఎంఆర్ సంస్థ దోపిడీ కారణంగా తాము వ్యాపారాలు చేసుకోలేకపోతున్నామని తెలిపారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మార్టూరు, చిలకలూరిపేట, వేమవరం ప్రాంతాలకు చెందిన గ్రానైట్ సంస్థల యజమానులు ధర్నాలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు యడవల్లి వద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఒంటిపులి అంజనేయులు, బెనర్జీ, సురేష్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, ప్రసాద్, చైతన్య, జీవన్‌రెడ్డి, చెరుకూరి నాగరాజు, శంకరరెడ్డి, పోపూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


**సత్‌క్రియల ద్వారానే మోక్షం**

గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

**గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి**

**4 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న సాగర్ నీరు**



7





## కొండవీడు ఘాట్‌లో విరిగిపడిన కొండచరియలు

7 ● ఘాట్‌మార్గం మూసివేత


# అమరేశ్వరాలయంలో.. కార్తీక పూజలు

అమరావతి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రాల్లో ప్రథమ ఆరామమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి కార్తీకమాస పూజలు నిర్వహించారు. పంచారామ క్షేత్రాలు దర్శించాలనుకున్న భక్తులు శనివారం రాత్రి వివిధ వాహనాల్లో అమరావతికి చేరుకున్నారు. తెల్లవారుజామున కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి నదీతీరం, ఆలయ ప్రాంగ ణంలో దీపాలను వెలిగించారు. అనంతరం స్వామివారిని దర్శిం చుకునేందుకు తెల్లవారు జామున 4 గంటల నుంచే క్యూల్లో భక్తులు బారులు దీరారు. 4.40 గంటలకు తలుపులు తెరుచుకోవడంతో భక్తు లు శివనామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో భక్తుల సందర్శనను ఈఓ రేఖ పర్యవేక్షించారు. సీఐ అచ్చియ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



క్యూలైన్‌లలో బారులు దీరిన భక్తులు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



# ఉపాధ్యాయులకూ.. ఆటలు

- 22 నుంచి డివిజన్ స్థాయిలో పోటీలు
- సన్నాహాలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ

వినుకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించి వారిని ప్రోత్సహించి భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషించే ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసేలా.. మరింత ఉత్సాహంగా బోధన చేసేలా.. శారీరక, మానసిక సామర్థ్యం పెరిగేలా.. ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ పాఠశాలలో దాదాపు 18 వేల మందికిపైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో కూడా అంతర్లీనంగా ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. క్రికెట్, త్రో బాల్, కబడ్డీ, క్యారమ్స్, షటిల్ తదితర పోటీలు తొలుత మండల స్థాయిలో నిర్వహించనున్నారు. ఆ తర్వాత డివిజన్ స్థాయిలో నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తుంది. ఈ బాధ్యతలను మండల స్థాయిలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్స్‌కు అప్పగించారు. మండలస్థాయిలో ఎంఈఓ 1, 2 నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈవో, జిల్లా స్థాయిలో డీఈవో స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి సమన్వయకర్తలుగా ఉంటారు. రాష్ట్ర స్థాయిలో పోటీలకు స్కూల్ గేమ్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, జేడీ స్థాయి అధికారి బాధ్యతలు తీసుకుంటారు. పోటీలకు తొలుత మండల సాయిలో జట్ల ఎంపికను చేస్తారు. ఉపాధ్యాయులకు సంబంధించి క్రికెట్ పోటీలకు సంబంధించి ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు, పాఠశాల సహాయకులు, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, పీఈటీలు, ఏడుగురు ఎస్జీటీల సహా మొత్తం 16 మందితో కమిటీ ఏర్పాటు చేస్తారు. అదేవిధంగా త్రోబాల్ ఇతర క్రీడలకు ప్రత్యేకంగా జట్ల ఎంపిక నిర్వహిస్తారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డీఈఓ లకు ఆదేశాలు జారీ అయ్యాయి.

**షెడ్యూల్ ఇలా...**

డివిజన్ స్థాయి : 22, 23 తేదీల్లో
జిల్లాస్థాయి : , 28, 29, 30 తేదీల్లో
రాష్ట్రస్థాయి : డిసెంబరు 6, 7, 13, 14

# దిక్సూచి

## క్యాట్ ఫైనల్ ప్రిపరేషన్
# వేగం, కచ్చితత్వం ప్రధానం

ఐఐఎం సహా పేరొందిన మేనేజ్‌మెంట్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్ష క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్). ఈ టెస్ట్‌లో సాధించిన పర్సంటైల్‌తో నేరుగా ప్రవేశం లభించదు. అయితే ఆ కాలేజీలు అడ్మిషన్‌కు సంబంధించి పరిగణనలోకి తీసుకునే ప్రాతిపదికల్లో మొదటిది మాత్రం క్యాట్ పర్సంటైల్. తొలిసారి ఈ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒకవైపు ఫైనలియర్‌లో చివరి అంకమైన ప్రాజెక్ట్ వర్క్ పనిలో ఉంటారు. మరోపక్క గేట్, క్యాట్ వంటి ప్రవేశ పరీక్షలు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ టెస్టుల బిజీలోనూ ఉంటారు. వీటిలో క్యాట్‌కు పట్టుమని నెల రోజుల గడువు కూడా లేదు. ఈ నేపథ్యంలో క్యాట్ తొలిసారి రాస్తున్నవారికి తోడు ఒకింత అవగాహనతో ముందుకు సాగుతున్న వారి వరకు అభ్యర్థులంతా టెస్ట్‌కు సమర్థంగా సన్నద్ధం కావచ్చు. అందుకు ప్రధానంగా... క్యాట్‌లో అడిగిన అన్ని ప్రశ్నలూ సాల్వ్ చేయాల్సిన అవసరం లేదు. 40 నుంచి 50 శాతం ప్రశ్నలను సాల్వ్ చేయగలిగితే చాలు, మంచి స్కోర్ సాధించవచ్చన్నది నిపుణుల సూచన. క్యాట్‌లో ప్రధానంగా మూడు విభాగాలు - వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ), డేటా ఇంట్రప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(క్యుఎ) ఉంటాయి. ఒక్కో విభాగానికి సంబంధించి ప్రిపరేషన్ ఇలా ఉండేలా చూసుకోవాలి.



### క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (క్యుఎ)

- ఈ విభాగంలో వేగం అంతకు మించి కచ్చితత్వం ప్రధానం. ఆ రెంటికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మంచి స్కోర్ సాధించాలి.
- అర్థమెటిక్, ఆల్జీబ్రా, జామెట్రీ, మోడ్రన్ మేథ్స్‌లోని కాన్సెప్ట్‌లను రివైజ్ చేసుకోవాలి. కాన్సెప్ట్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.
- ఈ విభాగం సెక్షనల్ మాక్ టెస్టులను వారానికి రెండు లేదా మూడు చొప్పున చేయాలి.
- అన్ని టాపిక్స్‌లో కలిపి ప్రతి రోజూ 30 నుంచి 40 ప్రశ్నలను సాల్వ్ చేయాలి.
- త్వరితగతిని గుర్తుకు తెచ్చుకునేందుకు వీలుగా ఫార్ములా నోట్‌బుక్‌ను మెయింటైన్ చేయాలి.
- గతం నిర్వహించిన ప్రశ్నపత్రాల్లో తరచూ అడుగుతున్న ప్రశ్నలను పదేపదే సాల్వ్ చేస్తుండాలి.

### డేటా ఇంట్రప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్)

- రోజుకు కనీసం రెండు, మూడు సెక్షనల్ మాక్ టెస్టులను చేయాలి. ప్రతి సారి సాల్వ్ చేయడంలో కష్ట స్థాయిని పెంచుకుంటూ వెళ్ళాలి.
- డేటా టేబుల్స్, లాజికల్ పజిల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి సెట్‌కు టైమ్ సెట్ చేసుకోవాలి. అలా సాల్వింగ్ కోసం పట్టే సమాయాన్ని తగ్గించుకోవాలి.
- ప్రతి మాక్ టెస్టులో దొర్లే తప్పులను విశ్లేషించుకోవాలి. సాల్వింగ్ నుంచి ఆలోచన, తుది నిర్ణయం వరకు ప్రతి చోట సాధారణంగా ఎదురవుతున్న తప్పులను ఒక దగ్గర నోట్ చేసుకోవాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- చివరి వారానికల్లా పది, పదిహేను నిమిషాల్లో ప్రతి సెట్‌ను పూర్తి చేయగలగడం అన్నది లక్ష్యంగా పెట్టుకోవాలి. అదే సమయం 80 నుంచి 90 శాతం మేర కచ్చితత్వాన్నీ సాధించాలి.

### వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ)

- రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడంలో సరైన పాటవానికి తోడు నిలకడ సాధించాలి.
- రోజుకు కనీసం మూడు రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడాన్ని అలవాటు చేసుకోవాలి.
- పారా జంబుల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- మాక్ టెస్టుల్లో అటు ఆ పరీక్ష, ఇటు వ్యక్తిగత ప్రతిభను సునిశితంగా విశ్లేషించుకోవాలి.

# డిజైనింగ్ @ ఎన్ఐడి



దుస్తులు, పాదరక్షలు, వాచీ, హ్యాండ్‌బ్యాగ్ సహా ఏదైనా సరే, ఒక వస్తువుకు ఉండాల్సిన సాధారణ లక్షణాలు దెబ్బతినకుండా అందంగా, ఆధునికంగా మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దడాన్నే డిజైనింగ్ అంటాం. ఈ అంశానికి సంబంధించి మన దేశంలో అత్యున్నత శిక్షణ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి) అహ్మదాబాద్. దానికితోడు గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్ ఏర్పాటు చేశారు. తరవాతి రోజుల్లో విజయవాడ (ఆంధ్రప్రదేశ్), కురుక్షేత్ర(హర్యానా), భోపాల్(మధ్యప్రదేశ్), జోర్హాట్(రాజస్థాన్)లలో కూడా ఎన్ఐడి దేనికదిగా ఏర్పాటై గ్రాడ్యుయేట్ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి. వీటన్నింటికి కలిపి అడ్మిషన్లకు ప్రకటన విడుదలైంది.

కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి). డిజైన్ ఎడ్యుకేషన్, సంబంధిత పరిశోధనలో గ్లోబల్ లీడర్‌గా అవతరించాలన్నది ఎన్ఐడి లక్ష్యం. విభిన్న డొమైన్లు ఇక్కడ ఉన్నాయి. కోర్సు పూర్తయ్యేనాటికి సంబంధిత పరిశ్రమలో ఇమిడిపోయే వ్యక్తిగా విద్యార్థిని తీర్చిదిద్దుతారు.

**బీ డిజైన్ సీట్లు:** అహ్మదాబాద్ క్యాంపస్‌లో 128 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కో దానిలో 75 సీట్లు ఉన్నాయి.

**అర్హత:** అభ్యర్థులు 2005 జూలై 1న లేదా ఆ తరవాత జన్మించి ఉండాలి. గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

**డీఏటీ వివరాలు:** ప్రిలిమ్స్‌ను పేపర్ - పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్ట్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో అడుగుతారు. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు.

**ఎం డిజైన్**
ఎన్ఐడి, అహ్మదాబాద్ క్యాంపస్ గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్‌లో మాత్రమే ఎం డిజైన్ కోర్సును అందిస్తున్నారు. మొత్తం 14 డిసిప్లిన్లలో దీనిని అందిస్తున్నారు. వివరాలకు సంబంధిత బ్రోచర్ చూడవచ్చు.

**ముఖ్య సమాచారం**
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.3,000; మహిళలు రూ.2000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500, దివ్యాంగులు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 1
- **డీఏటీ ప్రిలిమ్స్ తేదీ:** డిసెంబర్ 21
- **ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

SCHOLARSHIP ALERT

## Colgate Keep India Smiling Scholarship 2025-26

***Description:*** An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

***Eligibility:*** Indian students who are currently enrolled in Bachelor of Dental Surgery (BDS) (any year) or Master of Dental Surgery (MDS) courses in a recognised government or private institute. Applicants must have scored at least 65% marks in Class 12. Students must have an overall score of above 60% in their BDS to apply for the MDS scholarship. The annual family income of the applicants from all sources must not exceed INR 8 lakh.

***Prizes & Rewards:*** Scholarship of INR 75,000

***Last Date to Apply:*** 09-11-2025

***Application mode:*** Online applications only

***Short Url:*** www.b4s.in/aj/CKISSP7

buddy4study.com

## రైల్వేలో
# మెగా రిక్రూట్‌మెంట్

భారతీయ రైల్వే వివిధ పోస్టులకు వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలు ఉన్నాయి. వివిధ అర్హతలకు తోడు నిర్దేశిత ఎంపిక ప్రకియ ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. సంక్షిప్తంగా ఆ వివరాలు దిగువ ఇస్తున్నాం.



### నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (అండర్ గ్రాడ్యుయేట్)

- కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్: 2424
- అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 394
- జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 163
- ట్రైనీ క్లర్క్: 77

ఖాళీలు 3058

**అర్హత:** ఇంటర్ ఉత్తీర్ణత
**ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
**దరఖాస్తుకు ఆఖరు తేదీ:** నవంబర్ 27

### నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్)

- కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్: 161
- స్టేషన్ మాస్టర్: 615
- గూడ్స్ రైలు మేనేజర్: 3416
- జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: 921
- సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 638
- ట్రాఫిక్ అసిస్టెంట్: 59

ఖాళీలు 5810

**అర్హత:** డిగ్రీ ఉత్తీర్ణత. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులకు ఇంగ్లీష్/హిందీ టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి.
**ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత టెస్ట్(టైర్ 1, టైర్ 2)కు తోడు టైపింగ్ స్కిల్‌టెస్ట్/కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
**దరఖాస్తుకు ఆఖరు తేదీ:** నవంబర్ 20

### ఇంకొన్ని

జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకూ నోటిఫికేషన్ విడుదలైంది.

ఖాళీలు 2569

**అర్హత:** పోస్టును బట్టి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా/ బీఎస్సీ డిగ్రీ పాసై ఉండాలి.
**ఎంపిక:** రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, రైల్వే మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
**దరఖాస్తుకు ఆఖరు తేదీ:** నవంబర్ 20

# చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



## దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను

సుధీర్‌బాబు


"జటాధర' చిత్రంలో నేను పోషించిన పాత్రను తెలుగులో ఇప్పటివరకూ ఎవ్వరూ చేయలేదు. నా సినిమా హిట్ అయితే అది నా కష్టంగా భావిస్తా. ఫ్లాప్ అయితే నా ఓటమిగా స్వీకరిస్తా' అని హీరో సుధీర్ బాబు అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన చిత్రం 'జటాధర'. సోనాక్షి సిన్హా హీరోయిన్. ఉమేశ్‌కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఇందులో దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను. సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. శివుడి నేపథ్యంలో వచ్చే సీక్వెన్స్‌కు గూస్‌బంప్స్ పక్కా' అని తెలిపారు. 'జటాధర' సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది' అని శివిన్ నారంగ్ చెప్పారు. 'నాకు తెలుగు చిత్ర పరిశ్రమ అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం విషయంలో సహకారం అందించిన ప్రతీఒక్కరికీ కృతజ్ఞతలు' అని ప్రేరణ అరోరా పేర్కొన్నారు.

## గెలుపు పాటతో మొదలు



కన్నడ హీరోలు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి నటిస్తున్న మల్టీ స్టారర్ '45 ది మూవీ'. అర్జున్ జన్య దర్శకత్వంలో ఉమా రమేశ్‌రెడ్డి, ఎం. రమేశ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'గెలుపు తలుపు దొరికేవరకూ దిగులు పడకురా' అంటూ సాగే గీతాన్ని యూనిట్ ఆదివారం విడుదల చేసింది. దర్శకుడు అర్జున్ జన్య ఈ గీతాన్ని స్వరపరిచారు. రోల్ రైడా, వినాయక్ ఆలపించారు. సినిమాటోగ్రఫీ: సత్య హెగ్డే.

# స్టైలిష్ క్లైమాక్స్‌కు సిద్ధం



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. ఈ సినిమాను షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్‌పై సాహుగారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి కీలక షెడ్యూల్ గురించి అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఆదివారం నుంచి చిరంజీవి, ఫైటర్స్ బృందంపై స్టైలిష్ క్లైమాక్స్‌ను షూట్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని, విజువల్‌గా అద్భుత అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో కథానాయకుడు వెంకటేశ్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



## పెళ్లి తర్వాత ప్రేమంటే?

ప్రియ దర్శి, ఆనంది జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'ప్రేమంటే'. సుమ కనకాల కీలకపాత్ర పోషిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై పుస్కూర్ రామ్ మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. స్పిరిట్ మీడియా పతాకంపై రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. నవంబర్ 21న ఈ చిత్రం విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. టైటిల్‌కు తగ్గట్టుగానే ప్రేమలో ఉన్నప్పుడు పెళ్లి తర్వాత జీవితం గురించి కనే కలలు, వాస్తవ జీవితంలోని చిన్న చిన్న సమస్యలతో ఎలా మారుతుందో చూపిస్తూ ఆద్యంతం వినోదంగా సాగిన టీజర్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్‌రెడ్డి.

## వసుదేవ సుతం



మాస్టర్ మహేందర్ ప్రధాన పాత్రలో వైకుంఠ్ బోను తెరకెకిస్తున్న చిత్రం 'వసుదేవ సుతం'. ధన లక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'వసుదేవ సుతం' అంటూ సాగే గీతాన్ని హీరో ఆకాశ్ జగన్నాథ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పల్లెటూరి వాతావరణంలో అందర్నీ కట్టిపడేసేలా చిత్రీకరించిన ఈ పాట నాకు బాగా నచ్చింది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకం ఉంది. చిత్రం ఘనవిజయం సాధించాలి' అని కోరుకున్నారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ గీతానికి మణిశర్మ సంగీతం అందించారు.

## 60వ వసంతంలోకి షారుక్



ఫరాఖాన్

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ తన 60వ పుట్టినరోజును ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముంబైలోని ఆయన నివాసం మన్నత్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు, ఇతర సెలెబ్రిటీలతో కిక్కిరిసిపోయింది. ఫరాఖాన్, కరణ్ జోహర్, రాణి ముఖర్జీ తదితరులు షారుక్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎప్పటి లాగే ఈసారి కూడా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది అభిమానులు షారుక్ నివాసానికి తరలి వచ్చారు.

**భయం కాదు.. విధ్వంసం**

షారుక్ ఖాన్ కథానాయకుడిగా సిద్ధార్థ్ ఆనంద్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం షారుక్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఓ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ముందునుంచి ప్రచారంలో ఉన్న 'కింగ్' అనే టైటిల్‌నే అధికారికంగా నిర్ణయించారు. 'నేనెంత మందిని చంపానో గుర్తులేదు. వారు మంచివాళ్లా, చెడ్డవాళ్లా అన్నది నేనెప్పుడూ అడగలేదు. వారి కళ్లల్లో భయం మాత్రమే నాకు గుర్తుంది', 'వెయ్యికి పైగా హత్యలు చేసి, వందలాది దేశాల్లో మోస్ట్ వాంటెడ్ అయిన నాకు ఈ ప్రపంచం ఇచ్చిన పేరు.. కింగ్', 'నేను భయం కాదు.. విధ్వంసం' అనే సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్‌మెంట్స్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ సినిమాలో సరికొత్త షారుక్‌ను చూస్తారని మేకర్స్ హామీ ఇచ్చారు.

## మనం గర్వపడే సినిమా



రామ్ పోతినేని

రామ్ పోతినేని కథానాయకుడిగా పి.మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రచార చిత్రాలు, టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ 'ఆంధ్రా కింగ్ తాలూకా' నేను గర్వపడే సినిమా. మనమందరం గర్వపడే సినిమా. నా కెరీర్‌లో ఇంత అందమైన సినిమా ఇచ్చిన మహేశ్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కన్నడ నటుడు ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 28న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ్ నుని, సంగీతం: వివేక్, మెర్విన్.

## చాందినీ చిత్రం షురూ



చాందినీ చౌదరి ప్రధాన పాత్ర పోషిస్తున్న కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు తరుణ్ భాస్కర్ క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రానికి వికాస్ దర్శకుడు. సహచారి ప్రొడక్షన్ పతాకంపై సృజన్ గోపాల్ నిర్మిస్తున్నారు. సుశాంత్ యాష్కీ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా సృజన్ గోపాల్ మాట్లాడుతూ 'సైన్స్ ఫిక్షన్ డార్క్ కామెడీ జానర్లో ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. ఎవరూ ఊహించని ఒక సూపర్ హీరోను పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు. వికాస్ మాట్లాడుతూ 'అతీంద్రియ శక్తుల నేపథ్యంలో ఈ చిత్రం కథ సాగుతుంది. కాన్సెప్ట్ వీడియోను త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.



## హైదరాబాద్‌లో భారీ ఈవెంట్

మహేశ్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రబృందం నుంచి అప్డేట్ వచ్చింది. ఈనెల 15న హైదరాబాద్‌లో గ్లోబ్ ట్రొట్టర్ పేరుతో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. అందులో సినిమా టైటిల్, గ్లింప్స్ వీడియోను ఆవిష్కరించనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఓ ఓటీటీ సంస్థ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది. కాగా, సినిమా ప్రారంభమై రెండేళ్లు అవుతున్నా మేకర్స్ నుంచి అధికారికంగా ఒక్క అప్డేట్ కూడా రాలేదు. అయితే నవంబరులో అప్డేట్ ఇస్తామని గతంలో రాజమౌళి ఓ పోస్టు చేశారు. సినిమా టైటిల్‌తో పాటు మహేశ్‌బాబు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేస్తామని చెప్పడంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే నవంబరు మొదలైనా ఎలాంటి అప్డేట్ రాలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు 'నవంబరులో మీరు మాకు ఒక హామీ ఇచ్చారు. దయచేసి ఆ మాట నిలబెట్టుకోండి' అని ట్వీట్ చేశారు. దీంతో జక్కన్న కూడా 'సరే మహేశ్.. నవంబరు మొదలైంది ఇప్పుడే కదా.. మేము తప్పకుండా ఒక్కొక్కటిగా వెల్లడిస్తాం' అని సమాధానం ఇచ్చారు.



## రైతుల వెతలే కథగా...

పులివెందుల మహేశ్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రి షన్ను కథానాయిక. గంగా భవాని నిర్మించారు. హీరో సుమన్, ఆమని, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న సినిమా విడుదల కానుంది. ఇటీవలె నిర్వహించిన వేడుకలో చిత్ర దర్శకుడి తల్లిదండ్రులు ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సుమన్ మాట్లాడుతూ 'ఒక రైతు పాత్రలో రైతులకు అండగా నిలబడేలా నా క్యారెక్టర్ ఉండబోతుంది' అని తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధన



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు



కార్తీక దీపారాధనలు చేస్తున్న భక్తులు

పెదకాకాని, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆదివారం భక్తులతో పెదకాకాని మల్లన్న సన్నిధి కిటకిట లాడింది. తెల్లవారు జామున ఆలయ ప్రదక్షిణ నిర్వహించి, మల్లేశ్వర స్వామి, భ్రమరాంబకు ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపారాధనలు చేశారు. స్వామి వారి దర్శనం కోసం క్యూ లైన్లో భక్తులు బారులు తీరారు. ఆలయ ఉప కమిషనర్ లీలా కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పొంగలి తో ప్రదక్షిణ..

# సత్‌క్రియల ద్వారానే మోక్షం

## గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య

ఫిరంగిపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మానవాళి సత్‌క్రియల ద్వారానే దేవుడు మోక్షం కలుగు చేస్తాడని గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని ఆర్‌సీఎం సమాధుల తోటలో సకల ఆత్మల పండుగ సమష్టి దివ్య పూజాబలిలో ఆయన మాట్లాడారు. ప్రార్థనలు, దివ్య పూజాబలులు ద్వారా ఆత్మలు మోక్షం చేసుకుంటాయన్నారు. జనుల జీవన విధానాలను బట్టి మోక్షమో, నరకమో నిర్ణయించ బడుతుందన్నారు. భక్తితో చేసే ప్రతి త్యాగం ఆత్మలకు ఉపయోగ పడుతుందన్నారు. ఆత్మలకు నిత్య విశ్రాంతి కలుగ చేయాలని, కుటుంబీకులంతా ప్రార్థించాలన్నారు. సమాధులను అలంకరించి పూలు, రంగు రంగుల విద్యుద్దీపాలు వెలిగించి సమాధులను తేజోవంతంగా తీర్చిదిద్దారు. తమ పెద్దల ఆత్మల విశ్రాంతి కోసం కుటుంబీకులు చేస్తున్న పూజలు ఏసు దేవుడు ఫలింప చేశారని ఆయన ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సమాధులను బిషప్ ఆశీర్వదించారు. పూజలో చర్చి ఫాదర్ మాలపాటి పాతిమా మర్రెడ్డి, మద్దు బాలస్వామి తదితర గురువులు, కన్యస్త్రీలు, గుడి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



సందేశమిస్తున్న బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య

# ఆక్రమణలో.. ఆనవాళ్లు

(5వ పేజీ తరువాయి)

ఉండేది. ఆలయ నిర్వహణలో పాలుపంచుకునే వారిని కశ్మీర్, తమిళనాడు నుంచి విశ్వేశ్వరశంభు ప్రత్యేకంగా తీసుకొచ్చారు. ఇలా శివాలయం అప్పట్లో ఒక వెలుగు వెలిగింది. ఇది నేడు గర్భాలయం వరకే పరిమితమై కనిపిస్తున్నది.

### ఆక్రమణల మధ్య ఆనవాళ్లు మాయం..

కాకతీయుల అనంతరం జరిగిన ముస్లీంల దాడుల నేపథ్యంలో గోళకీమఠం దెబ్బతింది. ఆలయ మండపాలతో పాటు గర్భగుడిలోని శివలింగాన్ని కూడా ధ్వంసం చేశారు. ఆ తర్వాత అగ్రహారంగా ఉన్న ఈ ప్రాంతమంతా కాలగతిలో ఆక్రమణల పాలైంది. ఆలయం, రుద్రమదేవి శిలాశాసనం కూడా కనిపించనంతగా గృహాలు పుట్టుకొచ్చాయి. ఆలయానికి దక్షిణంగా 20 సెంట్లు, పడమరగా 16 సెంట్లు మాత్రమే మిగిలి ఉంది. ఆలయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ పరిధిలోకి తీసుకుని అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రామస్తులు ప్రభుత్వానికి అర్జీల రూపంలో విన్నవించుకున్నారు. డాక్టర్ భవానీ అనే డాక్టర్ ఇటీవల ఈ ఆలయ చరిత్రను తెలుసుకుని తన బంధుమిత్రుల సహకారంతో ఆలయ పునర్నిర్మాణం చేస్తానని ముందుకొచ్చారు. అయితే ఆలయం చుట్టూ వున్న 33 గృహాలవారు అందుకు అభ్యంతరాలను వ్యక్తం చేయడంతో ఆమె ఏమీ చేయలేక నిస్సహాయిరాలిగా ఉండిపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2018లో ఈ ఆలయాన్ని సందర్శించారు. అయినా అభివృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మందడం-తుళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు వెంబడి ఉన్న రుద్రమదేవి నిర్మించిన చెరువు కూడా మూడువైపులా ఆక్రమణలు పెరిగిపోయాయి.

### 2011 నుంచే మళ్లీ పూజాదికాలు

గోళకీమఠం స్ఫూర్తితో విజయవాడకు చెందిన శివస్వామి మందడం శివారులోని కృష్ణానది వెంట తాళ్లాయపాలెంలో శైవక్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. మల్కాపురంలో అరకొర గోడలతో సజీవశిలాజం మాదిరి మిగిలి ఉన్న గర్భగుడిలో 2011 చిన్న శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు జరిగేలా ఏర్పాటు చేశారు. ఇందుకు ఆలయం ఎదురుగా ఉన్న షేక్ అరుణ అనే మహిళ ఆర్థికసహకారాన్ని అందించారు. ములకల ఆదినారాయణ అనే పూజారి గత ఏడాదిగా స్వచ్ఛందంగా ఆలయంలో పూజాదికాలను నిర్వహిస్తున్నారు.

# ఆగిఉన్న లారీని ఢీకొని ఇద్దరి మృతి

వినుకొండటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీనీ ద్విచక్ర వాహనం వెనుక నుంచీ ఢీ కొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన మార్కాపురం రోడ్డులోని పసుపులేరు బిడ్జి వద్ద ఆదివారం రాత్రి చోటు చేసు కుంది. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా కురిచేడు సమీపంలోని మునెయ్య కాలనీకి చెందిన మన్నెయ్య (18), ఆనంద్ (14) ద్విచక్ర వాహనంపై వినుకొండ నుంచి కురిచేడు వైపు వస్తున్నారు. పసుపులేరు బ్రిడ్జి సమీపంలో జగ్గయ్య పేటకు చెందిన లారీ ఆపి డ్రైవర్ బహిర్భూమి వెళ్లాడు. ద్విక్రవాహనం వెనుక నుంచి లారీని ఢీ కొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని.. మృతదేహాలను వినుకొండ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.

# అంబేడ్కర్ ఆశయాలను గుండెల్లో నింపుకున్నారు

● కమ్యూనిటీ హాల్ శంకుస్థాపనలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

పెదకాకాని, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): డాకర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను దళితుల గుండెల్లో నింపుకున్నారని, వాటిని ప్రతి ఒక్కరు కొనసాగించాల్సిన అవసరం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం పెదకాకానిలోని లూథర్‌గిరి యువజన నగర్‌లో నందమూరి టెక్ ఫౌండేషన్ అధినేత ఎర్రంరెడ్డి అనిల్‌రెడ్డి సహకారంతో నిర్మించబోతున్న కమ్యూనిటీ హాల్ భవనానికి స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ.. మమకారం తప్ప మోసం అంటే తెలియని అంబేడ్కర్ ఆశయాలను గుండెల్లో నింపుకున్న దళిత సోదర సోదరీమణులకు హృదయపూర్వక నమస్కారాలు తెలియజేశారు. ఎర్రంరెడ్డి అనిల్‌రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు ఈ ప్రాంతంతో ఎలాంటి సంబంధం లేకపోయినా అమెరికాలో తనతో ఉన్న పరిచయంతో పేదలకు సహకారం అందించాలనే నిశ్చయంతో అనిల్‌రెడ్డి ముందుకు వచ్చారని తెలిపారు. సీఎస్ఆర్ నిధులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడ కమ్యూనిటీ హాల్ కావాలని ధూళిపాళ్లని అడిగితే ఆయన మొట్టమొదటిగా ఎంపిక చేసిన ప్రాంతం లూథర్‌గిరి, యువజన నగర్ ప్రాంతం అని తెలిపారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ కమ్యూనిటీ హాలు నిర్మాణంతో 15 ఏళ్ల నాటి కల నెరవేరిందన్నారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో సహకారంతో ఈ నిర్మాణం చేపట్టడం గర్వకారణంగా ఉందన్నారు. ఎర్రం రెడ్డి అనిల్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, గ్రామ సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి, టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పొన్నూరు యార్డ్ వైస్ చైర్మన్ తాళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి పెమ్మసాని, పక్కన ఎమ్మెల్యే నరేంద్ర తదితరులు

### ముఖ్యమంత్రి హామీలు అమలు చేయాలి!

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): 'రాజధాని ప్రాంతంలో రైతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయాలి. ఉన్న సమస్యలన్నింటికీ పరిష్కారం చూపించగలగాలి.' అని గ్రామీణాభివృద్ధి శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరులోని మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం కమిషనర్ కన్నబాబు, జాయింట్ కమిషనర్ భార్గవ తేజ సమావేశమయ్యారు. రాజధాని అంశాలపై, రాజధాని ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర మంత్రి వారితో చర్చించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్, వీధి పోటు, గ్రామకంఠం, అసైన్మెంట్ ల్యాండ్ భూసేకరణ, లేఅవుట్ డెవలప్మెంట్ సమస్యలపై జాబితాను సిద్ధం చేయాల్సి ఉందని మంత్రి సీఆర్డీఏ కమిషనర్‌కు చెప్పారు. పురపాలక శాఖ మంత్రి నారాయణ, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌తో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి రైతుల సమస్యలకు పరిష్కారం చూపే ప్రయత్నం చేయాలని తెలిపారు. అలాగే రాజధాని ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు, ఉద్యోగుల క్వార్టర్స్, విదేశీ భవన్, హడ్కోకు సంబంధించిన పెండింగ్ అంశాలు ఏమైనా ఉంటే జాబితా ఇవ్వాలని, ఆయా అంశాలపై ఢిల్లీ నుంచి తాను ఫాలోఅప్ చేస్తానని ఈ సందర్భంగా పెమ్మసాని కమిషనర్‌తో చెప్పారు.

# ప్రజల గుండెల్లో ఎర్రంనాయుడు చెరగని ముద్ర

తుళ్లూరు(మందడం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీమంత్రి, స్వర్గీయ కింజరాపు ఎర్రంనాయుడు ఒక విలక్షణ నేతగా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుని, ప్రజాభిమానం చూరగొన్నారని సీనియర్ జర్నలిస్టు, న్యాయవాది వి.ఆదినారాయణ, అమరావతి రాజధాని ఉద్యమ నేతలు పేర్కొన్నారు. ఆదివారం ఎర్రంనాయుడు 13వ వర్ధంతి సందర్భంగా తుళ్లూరు మండలం సచివాలయ సమీపం, మందడం అమరావతి ఉద్యమ శిబిరంలో ఆయనకు నివాళులర్పించారు. భారీ ఎత్తున ఫ్లెక్సీలు, కటవుట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ, రాజధాని ఉద్యమ నేతలు కట్టా రాజేంద్ర, వీరబాబు, బెజవాడ సాంబయ్య, పాతూరి రాంబాబు, బుల్లయ్య, గోవింద్‌రెడ్డి ప్రసంగిస్తూ తెలుగుదేశం ఆవిర్భావం నుంచి పార్టీని ఎర్రంనాయుడు బలోపేతం చేశారన్నారు. అజాతశత్రువుగా, బడుగు, బలహీనవర్గాల నేతగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యే, ఎంపీగా, కేంద్రమంత్రిగా, భారత రైల్వే బోర్డు చైర్మన్‌గా పని చేసి ఉత్తరాంధ్రతో పాటు ఉమ్మడి రాష్ట్రాభివృద్ధికి కృషి చేశారన్నారు. ఆయన బాటలో తనయుడు, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, సోదరుడు అచ్చెన్నాయుడు పయనిస్తున్నారని పేర్కొన్నారు.



మందడంలో ఎర్రం నాయుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఆదినారాయణ, రైతు ఉద్యమ నేతలు

# మహాత్ముడిని విమర్శించిన సినీ నటులను కఠినంగా శిక్షించాలి

● ఉద్రిక్తంగా ఎన్ఎస్‌యూఐ ఆమరణ నిరాహార దీక్ష


గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీని విమర్శించిన సినీ నటులను శిక్షించాలంటూ గుంటూరులో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీం ఆధ్వర్యంలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఉద్రిక్తతకు దారి తీసింది. హిమనీ సెంటర్‌లో ఆదివారం ఆమరణ దీక్షకు కూర్చున్న నాయకులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో వారు పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా పోలీసులు నిలువరించారు. పోలీసుల, ఎన్ఎస్‌యూఐ నాయకుల మధ్య తోపులాటలతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనతో పోలీసులు కరీంతో పాటు ఎన్ఎస్‌యూఐ నాయకులను స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇటీవల కొరియో గ్రాఫర్ శ్రష్టివర్మ, సినీ నటుడు శ్రీకాంత్ అయ్యంగర్, నటుడు రాహుల్ రామకృష్ణ వంటి వారు మహాత్ముడితో పాటు స్వాతంత్ర్య సమర యోధులపై అసభ్యకర వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. మహాత్ములను అగౌరవ పరిచిన నీచులను చట్టప్రకారం కఠినంగా శిక్షించే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఆందోళనకారులను వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

# పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ రేపు రాక

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ మంగళవారం గుంటూరు జిల్లాలో పర్యటించనుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటుందని చెప్పారు. అనంతరం రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్, వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలను సమీక్షిస్తుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఏపీ ఏవియేషన్ కార్పొరేషన్, ఎయిర్‌పోర్టుల అభివృద్ధి కార్పొరేషన్ కార్యకలాపాలను సమీక్షిస్తుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర సచివాలయానికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

# ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుంచి 1,58,175 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా, డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేసినట్లు జేఈ వెల్లడించారు.



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

### 4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఆదివారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 589.60 అడుగులు ఉంది. ఇది 310.84 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 7033 , ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,886, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,232, మొత్తం ఔట్‌ఫ్లో 72,151 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 72,151 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

### పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 41.19 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 78,434 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, నాలుగు గేట్ల ద్వారా 94,6044, మొత్తం 1,11,604 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

### 0.667 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల,నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఒక యూనిట్ ద్వారా శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 0.667 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 4 గేట్లను 2 మీటర్లు,2 గేట్లను మీటర్ మేర ఎత్తి 48,244 క్యూసెక్కులు, టేల్ రేస్ చానల్ ద్వారా 4288 మొత్తంగా 52,532 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 65,600 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.09 మీటర్లమేర నీరుండగా 6.799 టీఎంసీలకు సమానమన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేట రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి ): మోటారుసైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారిపై మండలం లోని ఉప్పలపాడు వద్ద చోటుచేసుకుంది. ఉప్పలపాడు గ్రామానికి చెందిన కన్నెదార శ్రీనివాసరావు (55 ) మోటారుసైకిల్‌పై నరసరావుపేటకు వస్తుండగా.. వినుకొండ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం అతనిని ఢీకొంది. శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతి చెందాడు. నరసరావుపేట రూరల్ ఎస్ఐ ఫాతిమా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుని భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ప్రత్తిపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న మోటార్‌సైకిల్‌ను వెనుక నుంచి మరో బైక్ ఢీ కొనడంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని తుమ్మలపాలెం పెప్సీ కంపెనీ సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు వివరాల మేరకు.. మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన కుంభా కోటేశ్వరరావు (65) చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామంలో ఉంటున్న తన కుమారుడి వద్ద ఉంటున్నాడు. శనివారం వృద్ధాప్య పింఛను తీసుకునేందుకు కుమారుడు సింగుబాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళుతున్నాడు. జాతీయ రహదారిపై వెనుక నుంచి మరో ద్విచక్ర వాహనం వారిని వేగంగా ఢీ కొనడంతో.. వెనుక కూర్చున్న కోటేశ్వరరావు కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో.. 108 అంబులెన్సులో గుంటూరులోని ఓ హాస్పిటల్‌కు అతనిని తీసుకెళ్లారు. అనంతరం జీజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొండవీడుకోట ఘాట్‌లో..

# విరిగి పడిన కొండచరియలు

● ఘాట్ మార్గం మూసివేత



రాళ్ల తొలగింపు పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో కృష్ణప్రియ

యడ్లపాడు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ప్రముఖ పర్యాటక కేంద్రం కొండవీడు కోట ఘాట్ మార్గంలో కొండ చరియలు ఆదివారం విరిగి పడ్డాయి. దీంతో ఘాట్ మార్గాన్ని అధికారులు మూసివేశారు. రోడ్డుపై బండ రాళ్ల తొలగింపు పనులను అటవీశాఖ అధికారులు చేపట్టారు. జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణప్రియ ఈ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండలపై నుంచి ఉధృతంగా ప్రవహించిన వర్షపు నీటితో పాటు బండరాళ్లు పెద్ద ఎత్తున ఘాట్ మార్గంపైకి జారిపడ్డాయన్నారు. బండరాళ్లను తొలగించే వరకు రాకపోకలను నిషేధించినట్లు వెల్లడించారు. ముందస్తు జాగ్రత్త చర్యలో భాగంగా తీసుకున్న చర్యలను పర్యాటకులు అర్థం చేసుకోవాలని కోరారు. రాకపోకల పునరుద్ధరణను త్వరలో తెలియజేస్తామన్నారు. మరో రెండు రోజులు పర్యాటకులు కొండవీడుకోట సందర్శనకు రావద్దని డీఎఫ్‌వో తెలిపారు.

# తెరుచుకున్న ఆలయ ద్వారాలు

ఎఫెక్ట్



అధికారుల సమక్షంలో తాళాలు తీస్తున్న పూజారి

చుండూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మున్నంగివారిపాలెం లోని తుంగభద్ర కాల్వ పక్కనే ఉన్న శ్రీ కాశీ విశ్వేశ్వర పాపవినాశన స్వామి దేవాలయ పూజల విషయంలో వివాదం ఏర్పడింది. దీనిపై ఆంధ్రజ్యోతిలో గుడివద్ద వివాదం - తెరుచుకోని ఆలయ ద్వారాలు అనే శీర్షికన ఆదివారం వెలువడిన కథనానికి జిల్లా దేవదాయ శాఖ అధికారులు స్పందించారు. ఆ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, డీసీ కేబీ శ్రీనివాస్ ఆదేశాలతో బాపట్ల డీఈవో సూర్యప్రకాశ్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ నాగరాజు, ఆలయ ఈవో నాగలక్ష్మి ఇతర సిబ్బంది ఉదయాన్నే దేవాలయ ప్రాంగణానికి చేరుకుని భక్తులు, గ్రామస్థులు, స్థానిక నాయకులతో చర్చించారు. అనంతరం అధికారులు ట్రస్టీ పేరుతో వ్యవహరిస్తున్న గాదె బాలకోటిరెడ్డి నుంచి గుడి తాళాలు తీసుకుని.. భక్తులు యథావిధిగా పూజలు నిర్వహించడానికి అవకాశం కల్పించారు. దీనితో మహిళా భక్తులు కార్తీక మాసంలో దేవాలయంలో పూజలకు అవకాశం లభించడంతో సంతోషం వ్యక్తం చేశారు.

# అరకు, యల్హాంకకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా గుంటూరు మీదగా అరకు, యల్హాంకకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 08551 అరకు - యల్హాంక స్పెషల్ ఈ నెల 13, 23 తేదీల్లో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి రాత్రి 10 గంటలకు గుంటూరు చేరుకుంటుందని తెలిపారు. 08552 యల్హాంక - అరకు స్పెషల్ ఈ నెల 14, 24 తేదీల్లో మధ్యాహ్నం 1.30కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2 గంటలకు గుంటూరుకు వస్తుందని పేర్కొన్నారు. 08553 శ్రీకాకుళం రోడ్డు - బెంగళూరు కంటోన్మెంట్ ప్రత్యేక రైలు 21న, 08554 బెంగళూరు కంటోన్మెంట్ - శ్రీకాకుళం రోడ్డు స్పెషల్ 24న గుంటూరు మీదగా నడపనున్నారు. అయితే డివిజనల్ హెడ్‌క్వార్టర్స్ గుంటూరులో హాల్టింగ్ ఇవ్వకుండా నంద్యాలలో కల్పించడంపై ప్రయాణికులు, వినియోగదారుల సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వాల్తేరు డివిజన్ హెడ్‌క్వార్టర్స్ దృష్టికి తీసుకెళతామన్నారు.

# కోడి పందేలు, పేకాట స్థావరాలపై దాడులు

నాదెండ్ల, క్రోసూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ఆదివారం జూదరుల ఆటకట్టించారు. కోడిపందేలు, పేకాట స్థావరాలపై దాడులు చేశారు. నాదెండ్ల మండలంలోని ఎండుగుంపాలెం - కోమటినేనివారిపాలెం వెళ్లే మార్గంలోని కోడి పందేల స్థావరంపై ఎస్ఐ పుల్లారావు సిబ్బందితో దాడి చేశారు. వారిని చూసి కొందరు పారిపోగా 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. 26 మోటారు బైక్‌లు, రూ.19,400 నగదు, సెల్‌ఫోన్లతో పాటు నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. క్రోసూరు మండలంలోని బయ్యవరం పొలాల్లో పేకాట స్థావరాలపై దాడి చేసినట్లు ఎస్ఐ రవిబాబు తెలిపారు. ఏడుగుర్ని అరెస్టు చేసి రూ.79,650 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ (కిలో) | 132, 141, 152 |
| చికెన్ విత్ స్కిన్(కిలో) | 252.00 |
| చికెన్ స్కిన్ లెస్(కిలో) | 262.00 |

# పల్నాడు వార్తలు



## నేల రాలిపోతున్న రైతు కష్టం

● ఆందోళనలో పత్తి రైతులు



రాలి పోయిన పత్తి పూత

దాచేపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పంట చేతికి వస్తున్న తరుణంలో ప్రకృతి కన్నెర్ర చేయటంతో చేతికి వస్తున్న పంట నేల రాలి పోతుంది. రైతులు ప్రకృతి వైపరీత్యాలకు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టిన పండించిన పంట తుఫాన్ తాకిడికి దెబ్బతింటుంది. దాచేపల్లి మండలంలో మూడు వేల ఎకరాలకు పైగా సాగు చేసిన పత్తి పంట పూత, పిందె దశలో ఉండి ఒక నెలలో పంట చేతికి వస్తుండగా తీవ్ర వర్షాల ప్రభావంతో పొలాలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ ఆధారంగా పంటలను పండించే రామాపురం, పొందుగుల, శ్రీనగర్, తంగెడ, మాదిపాడు, గామాలపాడు తదితర గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటి వరకు ఏడాదికి 15 నుంచి 20 క్వింటాళ్ళ దిగుబడి వస్తుందనుకుంటుండగా అది కాస్తా ఐదారు క్వింటాళ్ళకే పరిమిత మైంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

### మహా అన్నదానం

పిడుగురాళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కుసుమహరనాథ బాబా దేవాలయం వద్ద ఆదివారం సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు. తాన్న చిన్నయ్య, లక్ష్మమ్మల జ్ఞాపకార్థం తాన్న కోటేశ్వరరావు, కమలాకరరావు, రమణారావు, కుటుంబసభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. కుసుమహరనాథ బాబా దేవాలయం వద్ద 218వ ఆదివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ప్రతి ఆదివారం భక్తుల సహాయంతో పేదలకు అన్నదానం చేస్తున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు కొత్తకోటి హనుమంతరావు, వీవీ నాగేశ్వరరావులు తెలిపారు.

### శివాలయంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు

పిడుగురాళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చినఅగ్రహారంలోని శ్రీ గంగాపార్వతి సమేత చంద్రమౌళేశ్వరస్వామివారి దేవాలయంలో హిందూ ధర్మ ప్రచారపరిషత్ ధార్మిక సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు మూడు రోజులపాటు జరిగాయి. బ్రహ్మశ్రీ నోరి కోదండరామ్‌చే శ్రీ స్కాంద పురాణం అంతర్గత కార్తీక మహత్యం విశేషాలను భక్తులకు వివరించారు. శ్రీ శివసాయి గణపతి భక్త భజన మండలి వారిచే సాంప్రదాయ భజన కీర్తనలు జరిగాయి. దేవాలయ వంశపారంపర్య అర్చకులు శ్రీ వెల్లటూరి చంద్రశేఖర శర్మ నేతృత్వంలో జరిగిన ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాలో భక్తులు, స్వాములు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఘనంగా బ్రహ్మంగారి జయంతి

సత్తెనపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతిని ఆదివారం సనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర స్వామికి, గోవిందాంబకు, ఈశ్వరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో వి.రత్నమాచార్యులు, అంకాళ్ళ రమేష్, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### వైభవంగా అయ్యప్ప స్వామి పడిపూజ



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

కారంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజా మహోత్సవాన్ని గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా అలకరించి ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం జరిపారు. గురజాల బ్రహ్మం గురుస్వామి హోమగుండం పూజ జరిపారు. సుమారు 1000 మంది మాలదారులు ఈ పడిపూజలో పాల్గొన్నారు.

### గుండ్లపల్లిలో క్షీరాబ్ది ద్వాదశి పూజలు

నకరికల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గుండ్లపల్లిలో ఉన్న మల్లేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం క్షీరాబ్ది ద్వాదశి పూజలను నిర్వహించారు. భక్తులు స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. కార్తీకమాసం ఆదివారం క్షీరాబ్ది ద్వాదశి పురస్కరించుకొని స్వామికి విశేష అభిషేకాలు చేశారు. స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

### నకిలీ బిల్లులతో వెళ్తున్న గ్రానైట్ లారీల స్వాధీనం

నకరికల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ రవాణా చేస్తున్న రెండు గ్రానైట్ లారీలను ఒంగోలు మైనింగ్ ఏడీ బీ రామచంద్రరావు ఆదివారం అదుపులోకి తీసుకొని నకరికల్లు పోలీసులకు అప్పగించారు. నకిలీ బిల్లులతో అక్రమంగా గ్రానైట్ రవాణా చేస్తున్నట్లు గుర్తించి నకరికల్లు పోలీసులకు స్వాధీనం చేశారు.

### శ్మశాన వాటికలో స్వచ్ఛభారత్

మాచర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జమ్మలమడక రహదారిలోని హిందూ శ్మశాన వాటికలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి ఆధ్వర్యాన శ్మశాన వాటిక ఆవరణలోని పిచ్చి చెట్లు, ముళ్ల కంపలు, చెత్తాచెదారం తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, శ్రీనివాసరావు, రిటైర్డ్ హెచ్‌ఎం అందుగుల చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, సీహెచ్ రుక్మిణి, ప్రభావతి, నారాయణమ్మ పాల్గొన్నారు.

### ఘనంగా స్త్రీల సమాజం ఆదివారం కూడిక

దుర్గి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏఈఎల్‌సీ చర్చిలో ఆదివారం స్త్రీల సమాజం ఆదివారం కూడికను సంఘ కాపరి దేగల యోహాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో క్రైస్తవ గీతాలను ఆలపించారు.

### ఘనంగా ఆత్మల పండుగ

రెంటచింతల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రెంటచింతల ఆర్‌సీఎం చర్చిలోని శ్మశానవాటికలో ఆదివారం ఆత్మల పండుగను స్థానిక ఫాదర్ వైఎల్ మర్రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. గతించిన పూర్వీకులను గౌరవించడం, జ్ఞాపకం చేసుకోవడమే ఈ పండుగ పరమార్థమని ముఖ్య అతిథి ఫాదర్ చాట్ల మరియదాసు అన్నారు. ఈ కార్యక్రమంలో విచారణా గురువులు వైఎల్ మర్రెడ్డి, గోవిందు బాలస్వామి, ఎలీషా రాజ్, బాల శౌర్రెడ్డి, ఫ్రాన్సిస్, ప్రసన్నకుమార్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆర్‌సీఎం ఆధ్వర్యంలో..

అచ్చంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుపాలెం, తాళ్ళచెరువు గ్రామాల్లో సకల ఆత్మల పండుగ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌సీఎం క్రైస్తవులు వారి బంధువుల సమాధుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. తాళ్ళచెరువు విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ తుమ్మా మర్రెడ్డి ఆధ్వర్యంలో సమాధుల వద్ద దివ్యపూజాబలి నిర్వహించారు.

### జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు
## క్రోసూరు జడ్పీ విద్యార్థినులు

క్రోసూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి అండర్-17 బాలికల ఖోఖో పోటీలకు క్రోసూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు సీహెచ్ సలోమి, ఎస్ హెప్సి మనోజ్ఞ, జి.షోలోమి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుగ్గిబాబూరావు ఆదివారం తెలిపారు. జిల్లాస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థినులను, వారికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ ముప్పా నరసింహారావును ప్రధానోపాధ్యాయుడితో పాటు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ షేక్ సత్తార్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.


## పేరుకు పోయిన షాపింగ్ కాంప్లెక్స్ బకాయిలు



యర్రం వెంకటేశ్వరరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో మూతపడ్డ గదులు

సత్తెనపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి పురపాలక సంఘంలోని వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌ల అద్దె బకాయిలు పేరుకు పోయాయి. రెవెన్యూ సిబ్బంది ఈ విషయం పై దృష్టి సారించినప్పటికీ గదులను అద్దెకు తీసుకున్న బకాయిదారులు అద్దెలు చెల్లించక పోవటంతో పురపాలక సంఘ ఆదాయానికి గండి పడుతోంది. సత్తెనపల్లి పురపాలక సంఘంలోని రాజీవ్‌గాంధీ కూరగాయల మార్కెట్‌లో 45 గదులు ఉండగా 15 గదులు నిరుపయోగంగా ఉన్నాయి. అక్కడ రూ 4,10,754 అద్దె బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. ఎన్‌టీఆర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 40 గదులకు ఉండగా 18 గదులు నిరుపయోగంగా ఉన్నాయి. అక్కడ రూ 2,72,730 బకాయిలు ఉన్నాయి. యర్రం వెంకటేశ్వరరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో 23 గదులకు గాను నాలుగు గదులు నిరుపయోగంగా ఉన్నాయి. 2,994,656ల బకాయిలు ఉన్నాయి. వావిలాల షాపింగ్ కాంప్లెక్స్‌లో 18 గదులకు గాను తొమ్మిది గదులు నిరుపయోగంగా ఉన్నాయి. రూ 3,09,600 వరకు అద్దె బకాయిలు పురపాలక సంఘానికి జమ కావాల్సి ఉంది. మునిసిపల్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నా గదులు అద్దెకు తీసుకున్న వారి నుంచి స్పందన కన్పించటం లేదు. ఖాళీగా ఉన్న గదులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నప్పటికీ వేలంలో పాల్గొనేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. ఈ విషయం పై మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ బకాయిదారులకు నోటీసులు జారీ చేశామని, ఖాళీగా ఉన్న గదులకు వేలం పాటలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. బకాయిలు మొత్తం వసూలు చేస్తామన్నారు.

## పత్తి రైతుల కోసం కపాస్ కిసాన్ యాప్




మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసిన కపాస్ కిసాన్ యాప్

క్రోసూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో రూపొందించిన కపాస్ కిసాన్ యాప్‌తో పత్తి రైతులకు ఇకపై దళారుల నుంచి రక్షణ లభిస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి సంవత్సరం పత్తి తీతలు ప్రారంభం కాగానే దళారులు రంగ ప్రవేశం చేయటం, రకరకాల కారణాలు చూపి రైతుల నుంచి అయిన కాడికి తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి దోపిడీ చేయటం జరుగుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వం కాపాస్ కిసాన్ యాప్‌ను ప్రారంభించింది. పత్తి రైతులు తమ మొబైల్ ఫోన్‌లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని పత్తి సాగు వివరాలను నమోదు చేసి స్లాటు బుక్ చేసుకుంటే చాలు. కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వారు రైతుల నుంచి ఎప్పుడు పత్తి కొనుగోలు చేసేది సమాచారం ఇస్తారు. రైతులు ఆ తేదీల్లో పత్తిని కేంద్రానికి తీసుకు వెళితే పత్తి నాణ్యతను బట్టి ధర నిర్ణయించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ సంవత్సరం గరిష్టంగా క్వింటాకు రూ.8,110, కనిష్టంగా రూ.7,785 మద్దతు ధర ప్రకటించింది. మొబైల్ యాప్‌లలో స్లాటు ఏవిధంగా బుక్ చేసుకోవాలో రైతులకు అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బంది సాయంతో కూడా స్లాట్లను బుక్ చేసుకోవచ్చు.

### సమాజ రుగ్మతలకు విరుగుడు విద్యే

● డిప్యూటీ కలెక్టర్ కె.చంద్రశేఖరరావు

రెంటచింతల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో నెలకొన్న రుగ్మతలకు విరుగుడు విద్యేనని, చదువుకోవడం వల్ల ప్రతి రంగంలోను రాణించొచ్చని మచిలీపట్టణం డిప్యూటీ కలెక్టర్ కట్టమూరి చంద్రశేఖర్‌రావు అన్నారు. ఆదివారం పాఠశాల పూర్వవిద్యార్థిగా స్థానిక వైఆర్‌ఎస్ హైస్కూల్‌ను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హెచ్‌ఎం కె.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలని బట్టీ పద్ధతి పనికిరాదని సూ చించారు. ఈ సందర్భంగా డిప్యూటి కలెక్టర్ దం పతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కె.నూతన్, ఓ.వెంకటేశ్వరరావు, బి.ఈశ్వరరెడ్డి, నారాయణం రాజ్‌కుమార్, జి.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నాగసుధీర్ మృతి పార్టీకి తీరని లోటు



నాగసుధీర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

అమరావతి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగుయువత నాయకుడు కోటా నాగసుధీర్ మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం నాగసుధీర్ పెద్ద కర్మ కార్యక్రమానికి ఎంపీ లావు కృష్ణదేవరాయలు, సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ వెన్నా సాంబశివారెడ్డితో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగసుధీర్ పార్టీకి చేసిన సేవలను వారు కొనియాడారు.

### 4 నుంచి జాతీయ సేవా పథకం

బెల్లంకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ నెల 4వ తేదీ నుంచి జాతీయ సేవా పథకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సునీత పేర్కొన్నారు. మండలంలోని న్యూ చిట్యా ల ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో వారంపాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్‌పై అవగాహన, శానిటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆమె చెప్పారు.

### రూ.10 వేల ఆర్థికసాయం

గురజాలటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెగుంత గ్రామానికి చెందిన పాటిబండ్ల పేరమ్మ శనివారం అనారోగ్య కారణాలతో మృతిచెందింది. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం పేరమ్మ కుటుంబసభ్యులకు టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ రూ. 10 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జాస్తి ప్రకాష్, వీరనారాయణ, రామయ్య, బ్రహ్మయ్య, వీరస్వామి, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న లక్ష్మీనారాయణ

## ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు బ్రహ్మయ్య

పెదకూరపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మండల టీడీపీ అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. పెదకూరపాడులోని పంచాయతీ రాజ్ అతిథి గృహంలో ఆదివారం టీడీపీ కమిటీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ మాజీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ పార్టీని మరింతగా బల పరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాగల గంగాధర్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ వడ్లమూడి అప్పారావు, తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి బాష్యం ఆంజనేయులు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మక్కెన సాగర్, మండల టీడీపీ నేతలు గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, కావూరి సుజాత, షేక్ అజ్మల్లా, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ యూనిట్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

### అంబులెన్స్‌లో ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం

మాచర్ల రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణీని అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలిస్తుండగా అంబులెన్స్‌లో డెలివరీ జరిగి తల్లి, బిడ్డ క్షేమంగా బయటపడ్డారు. దుర్గి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన ఆదిరాల పెద్ద చిట్టి కాన్పునకు పురిటి నొప్పులతో మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు ఆదివారం వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యులు నరసరావుపేట రిఫర్ చేశారు. అంబులెన్స్‌లో నరసరావుపేట వెళ్తుండగా మార్గమధ్యంలోని కారంపూడి మండలం ఒప్పిచర్ల సమీపంలో పురిటి నొప్పులు అధికవడంతో అంబులెన్స్ ఈఎంటీ రాజు డెలివరీ చేశారు. చిట్టి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా బయటపడి ఆరోగ్యంతో ఉన్నారు. అనంతరం వైద్య సిబ్బంది తల్లి, బిడ్డను నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈఎంటీ రాజు, పైలట్ వేణుగోపాల్‌లకు చిట్టి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### కేరింతలు కొట్టి క్రీడాభిమానం



పిడుగురాళ్ల షాదీఖానాలో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్‌పై మ్యాచ్‌ను వీక్షిస్తున్న కూటమి నేతలు, మహిళలు

పిడుగురాళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఐసిసి ఉమెన్స్ వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌ను తిలకించేందుకు ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నిఖిల్ ఆధ్వర్యంలో స్థానిక షాదీఖానాలో ఆదివా రం బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటుచేశారు. సౌత్ ఆఫ్రికా, ఇండియా జట్ల మధ్య జరిగే ఉ మెన్స్ ప్రపంచకప్ ఫైనల్ సంగ్రామాన్ని వీక్షించేందుకు పట్టణంలోని మహిళలు, కూటమి నేతలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో పిల్లి చెన్నారావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, తురకా వీరస్వామి, సయ్యద్ అమీర్‌అలీ, జెమిని రామకృష్ణ, నడికూడి వెంకటేశ్వరరావు, ఆవుల జనార్ధనరావు, చల్లగుండ్ల సీత, అనురాధ, వెంకటరమణ పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్: కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు పార్టీ శ్రేణులు పట్టణంలోని మానుకొండ కళ్యాణ మండపంలో మహిళల వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లైవ్ టెలికాస్ట్‌ను చేశారు. పట్టణంలోని క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో వీక్షించారు.

● పెదకూరపాడు: భారత మహిళా క్రికెట్ జట్టు, సౌతాఫ్రికా జట్ల మధ్య జరిగిన ప్రపంచ కప్ ఫైనల్స్‌ను ప్రజలు వీక్షించేందుకు పెదకూరపాడులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఎమ్మెల్యే ప్రవీణ్ ప్రత్యేక స్క్రీన్‌ను ఏర్పాటు చేయించారు. మహిళలు అధిక సంఖ్యలో మ్యాచ్‌ను తిలకించారు.

## పశువుల కేంద్రంగా నకరికల్లు బస్టాండ్



పశువుల నివాసంగా మారిన నకరికల్లు బస్టాండ్

నకరికల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నకరికల్లులో ఆర్టీసీ బస్టాండ్ పశువుల కేంద్రంగా మారింది. లక్షల రూపాయల వ్యయంతో మండల కేంద్రాల ఏర్పాటు సమయంలో నకరికల్లు బస్టాండ్‌ను నిర్మించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాలన్నీ ఎరువుల దిబ్బలు, రహదారులుగా మారి ఆక్రమణలకు గురయ్యాయి. ఆర్టీసీ అధికారులు పట్టించుకోక పోవటంతో బస్టాండ్‌లో పశువులను కట్టేసి వాడుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు ఈ స్థలాన్ని ఉపయోగంలోకి తెచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని నకరికల్లు ప్రజలు కోరుతున్నారు.

### సాగరమాత ఆలయంలో ప్రార్థనలు

విజయపురిసౌత్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యాన దివ్యబలిపూజ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తలనీలాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

### కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

రాజుపాలెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో వడ్డెంపూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో అన్ని రకాల కంటి పరీక్షలతో పాటు కంట్లో శుక్లాన్ని పరీక్షించి అవసరమైన వారందరికీ ఉచితంగా శుక్లం ఆపరేషన్ చేసి కళ్ళజోళ్ళు ఉచితంగా ఇస్తామని నిర్వాహకులు వడ్డెంపూడి ఫౌండేషన్ సభ్యులు విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో గ్రామంలోని సాయిబాబా ఆర్చ్ వద్ద ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఉదయం 9 గంటల నుండి నిర్వహించిన ఈ శిబిరానికి పరిసర గ్రామాల నుండి రోగులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. తొలుత శిబిరాన్ని జడ్పీటీసీ మాజీ సభ్యుడు మర్రి వెంకట్రామిరెడ్డి, టీడీపీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో శంకర్ కంటి వైద్యశాల సిబ్బంది, గ్రామ టీడీపీ అధ్యక్షుడు వడ్డెంపూడి వెంకట్రావు, నర్రా మల్లికార్జునరావు, అలా సుబ్బారావు తదితరులు ఉన్నారు.



గణపవరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న శంకర్ కంటి హాస్పిటల్ వైద్యులు





రైల్వేస్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న జడ్ఆర్‌యూసీసీ సభ్యురాలు కొంకా రాధ, కూటమి నేతలు

### రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

పిడుగురాళ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంటుందని జడ్ఆర్‌యూసిసి సభ్యురాలు కొంకా రాధ తెలిపారు. ఆదివారం స్థానిక రైల్వేస్టేషన్‌ను కూటమి నేతలతో కలిసి సందర్శించారు. స్టేషన్‌లో వున్న క్యాంటీన్ ధరలు, పట్టిక, టాయ్‌లెట్ల శుభ్రత, ఉచిత తాగునీరు వంటి సౌకర్యాల గురించి రైల్వేస్టేషన్ సిబ్బందిని అడిగి తెలుసుకోవంతో పాటు మాచర్ల రైలు బోగీల ఇబ్బందులు, వందేమాతరం రైలుకు స్టాప్ వంటి సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి చెన్నారావు, తురకా వీరస్వామి, పాండురంగ శ్రీను, కామిశెట్టి రమేష్, మేకల సాంబశివరావు, వడ్లమూడి వెంకయ్య, గోళ్ల కిరణ్, చేగు రమేష్, వల్లెపు రామకృష్ణ, తదితరులున్నారు.

### రాజుపాలెంలో మంగళ కైశిక ద్వాదశి నిర్వహణ



మంగళ కైశిక ద్వాదశి మహోత్సవం నిర్వహిస్తున్న శ్రీ వైష్ణవ హరిదాసుల సంఘం

రాజుపాలెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రాజుపాలెంలో మన గుడి, మంగళ కైశిక ద్వాదశి కార్యక్రమం నిర్వహించారు. తొలుత శ్రీ వైష్ణవ హరిదాసులు రాజుపాలెం, గంగిరెడ్డిపాలెం గ్రామాలలో ఫ్లెక్సీతో కలియతిరిగి సనాతన ధర్మపరిరక్షణకు కట్టుబడి ఉండాలని చెప్పారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో గ్రామ పెద్దలు చొక్క శ్రీనివాసరావు, లేబాకుల బ్రహ్మయ్యలు భక్తి పాటలు ఆలపించి గ్రామస్థులను రంజింపచేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ అభినందనీయమని ప్రముఖ పుణ్యక్షేత్ర అర్చకులు బొర్రా వెంకట అనంతాచార్యులు కొనియాడారు.

### సీఎం సహాయనిధి చెక్కు అందజేత



వేరమ్మకు చెక్కును అందజేస్తున్న అంజయ్య

కారంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన ఉన్నం వేరమ్మ అనారోగ్య కారణాలతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు ఆమెకు మంజూరైన రూ.41,100 చెక్కును ఆదివారం మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య చింతపల్లి గ్రామానికి చేరుకొని వేరమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ ఉన్నం మాధవి మల్లికార్జునరావు, సీహెచ్ చిన సాంబయ్య, పంగులూరి సత్యనారాయణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### సత్రశాలలో అన్నదానం

రెంటచింతల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఉత్సవాల్లో భాగంగా కృష్ణానది తీరాన గల సత్రశాల మల్లిఖార్జునస్వామి సన్నిధిలో వివిధ మాలలు ధరించిన స్వాములకు ఆదివారం భారీగా అన్నదానం చేశారు. అన్నదానం చేసిన మొక్కపాటి శ్రీనివాస్, నాగ మల్లేశ్వరీ, నీలం పెద వెంకటేశ్వర్లు, చెన్నమ్మ, కె.భవానిశంకర్, నాగలక్ష్మి దంపతులను సత్రశాల ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ జీవీ శివయ్య ఘనంగా సన్మానించి.. అమ్మవారి ప్రతిమలను అందచేశారు. అలాగే రెంటచింతల వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఛైర్మన్ నాళం పెదబాబు నేతృత్వంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డి, ట్రస్ట్‌బోర్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

### జగన్ అసత్య ప్రచారాలను నమ్మొద్దు

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అంజయ్య

కారంపూడి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ అధినేత జగన్ చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య కోరారు. ఆదివారం కారంపూడిలోని టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మొంథా తుఫాన్ ప్రభావాన్ని ముందుగానే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అంచనా వేసి అధికారులను అప్రమత్తం చేసి నష్టాన్ని తగ్గించారని, ఇది జగన్ కంటికి కనిపించడం లేదని అన్నారు. రైతులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. అంజయ్య వెంట టీడీపీ మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, తెలుగు యువత నేత బొల్నేడి కోటేశ్వరరావు, బీసీ కన్వీనర్ గోరంట్ల నాగేశ్వరరావు, చింతపల్లి సర్పంచ్ ఉన్నం మాధవి మల్లికార్జునరావు, టీడీపీ కారంపూడి పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరిరావు, మాజీ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

### ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

క్రోసూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్ళేలా కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు మొగల్‌జాన్, జిల్లా ఉపాధ్యక్షుడు నలజాల సదాశివరావు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కాండ్రు కాశయ్య అన్నారు. ఆదివారం క్రోసూరు యార్డులో టీడీపీ మండల సర్వసభ్య సమావేశం మొగల్ జాన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సూపర్-6 పథకాలను చిత్తశుద్ధితో అమలుచేస్తుందని, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో దీనికి ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యకర్తలందరూ ఐక్యంగా కొద్ది నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మరోసారి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

### చట్ట ప్రకారమే పనులు

● టీడీపీ సీనియర్ నేత యాగంటి

మాచర్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చట్ట ప్రకారమే కూటమి ప్రభుత్వం పనులు నిర్వహిస్తోందని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని తన కార్యాయలంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నకిలీ మద్యం చేస్తుందంటూ వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. జోగి రమేష్ మంత్రిగా ఉన్నప్పుడు ఈ నకిలీ మద్యం మొదలు పెట్టారని సిట్ అధికారులు గుర్తించారన్నారు. కూటమి ప్రభుత్వం తనను తప్పుడు కేసులో అరెస్ట్ చేస్తున్నారని జోగి రమేష్ అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఈ సమావేశంలో వంగవరపు (బొట్టు) కోటేశ్వరరావు, తిక్కా కొండలు, దుర్భాకుల ప్రసాద్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

నరసరావుపేట రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాలపాడు రోడ్డులోని చిన్న సింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో శ్రీఆంజనేయస్వామి వారి వాలం పూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంజనేయస్వామి ఆలయంలో మొదటిసారి నరసరావుపేటలో 30సంవత్సరాల తర్వాత తోక పూజ నిర్వహించారు. ఆదివారం రోజు నుంచి స్వామి వారి జన్మ నక్షత్రం రోజున ప్రతి నెల ఆంజనేయస్వామి వాలం పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



## 15న దేశవ్యాప్తంగా బిర్సా ముండా జయంతి

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న దేశవ్యాప్తంగా జాతీయ గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు బిర్సా ముండా జయంతిని ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.శ్రీను నాయక్ ఆదివారం ఇక్కడ తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం గిరిజన పాఠశాల, కళాశాలలలో 15 రోజులపాటు జన్ జాతీయ గౌరవ్ దివస్ అనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తుందని పేర్కొన్నారు.


సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్యను సత్కరిస్తున్న సీపీఐ నాయకులు

## సీపీఐ కొత్త కార్యదర్శి ఈశ్వరయ్యకు సన్మానం

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కొత్తగా ఎన్నికైన గుజ్జుల ఈశ్వరయ్యను ఆదివారం చిలకలూరిపేట నియోజకవర్గ సీపీఐ నాయకులు, కార్యకర్తలు విజయవాడకు ప్రత్యేకంగా తరలివెళ్లి సీపీఐ కార్యాలయంలో సన్మానించారు. రాష్ట్ర పార్టీకి రూ.50వేల విరాళాన్ని ఈ సందర్భంగా వారు ఆయనకు అందచేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తాళ్లూరు బాబురావు, బొంత ధనరాజు, చెరుకుపల్లి నిర్మల, ఏఐవైఎఫ్, ఏఐటియుసి నాయకులు షేక్ సుభాని, దాసరి వరహాలు, ఏలికా శ్రీనివాసరావు, సృజన్, బొంతా సుబ్బారావు, యడవల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన భాగవత సప్తాహం

యడ్లపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 26న ప్రారంభమైన భాగవత సప్తాహ పారాయణ కార్యక్రమం శనివారం సాయంత్రం ముగిసింది. ముగింపు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కన్నుల పండువగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వమించారు. సప్తాహ కార్యక్రమాలు ముగిసిన సందర్భంగా ఆదివారం కార్తీక వనసమారాధన, భారీ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సప్తాహ కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించడంతోపాటు భక్తి శ్రద్ధలతో పారాయణం చేసిన పావులూరి నాగేశ్వరరావు, కామేపల్లి ఆంజనేయులు, శేషగిరి వెంకటేశ్వర్లు, పావులూరి సామ్రాజ్యం, పావులూరి భ్రమరాంబ, రావి అంజనీదేవి, పావులూరి సుబ్బాయమ్మ, అర్చకులు శ్రీదీక్షితులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ప్రసాదరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## పీపీపీకి వ్యతిరేకంగా కోటిసంతకాల సేకరణ

శావల్యాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్వహణపై కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని బొందిలిపాలెం, శానంపూడి, ముండ్రువారిపాలెం, చిన్నకంచెర్ల గ్రామాల్లో వైసీపీ నాయకులు ఆదివారం కోటి సంతకాలు కార్యక్రమాన్ని చేపట్టారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం వల్ల పేదవిద్యార్థులు వైద్యవిద్యను అభ్యసించే అవకాశాన్ని కోల్పోతారని, పేదలకు వైద్యసేవలు సక్రమంగా అందవన్నారు. వైసీపీ నేతలు బి.వీరాంజనేయులు, చింతా విజయ్‌కుమార్, పి.నాగేశ్వరావు, ఎం.శ్రీను, సి.రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణ సమాఖ్య నూతన కార్యవర్గం

యడ్లపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరణవీరాంజనేయస్వామి యడ్లపాడు మండల బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం, నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం జరిగింది. మండలంలోని బోయపాలెంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా సమాఖ్య గడచిన సంవత్సరాలలో సభ్యుల అభ్యున్నతికి చేసిన కృషి, రాబోయే సంవత్సరాలలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడిగా పరాంకుశం హనుమాచార్యులు, అధ్యక్షుడిగా వైబీవీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా వంకాయలపాటి ప్రేమ్‌కుమార్, కార్యదర్శిగా వంకాయలపాటి సాయితేజ, సంయుక్త కార్యదర్శిగా పెళ్ళూరి పవన్‌కుమార్, కోశాధికారిగా పెళ్లూరి శ్రీరామమూర్తి, ముఖ్య సలహాదారుగా వంకాయలపాటి ఆనంద్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఎం.హనుమంతరావు, జి.సత్యనారాయణ, ఎస్.మాధురిదేవి, ఎం.రేణుక, వి.పవన్‌కుమార్, కె.ధనలక్ష్మి, ఎం.రామచంద్రరావులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి బ్రాహ్మణ కుటుంబ సభ్యులు, పెద్దలు హాజరయ్యారు.

# నిరుపయోగంగా బస్టాండ్, బస్ షెల్టర్

● ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు
● లక్షల ప్రజాధనం వృథా



శావల్యాపురంలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్, నిర్మానుష్యంగా ఉన్న బస్ షెల్టర్

శావల్యాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): లక్షలకొద్దీ ప్రజాధనాన్ని ఖర్చుచేసి నిర్మించిన ఆర్టీసీ భవనాలు ఉండాల్సిన ప్రదేశాలలో లేకపోవడంతో అవి ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. భవనాలున్నా ఎండకు, వానకు అవి ఏమాత్రం ఉపయోగపడక పోవడంతో ప్రయాణికులకు ఇక్కట్లు మాత్రం తప్పడం లేదు. గుంటూరు- కర్నూలు జాతీయ రహదారి పక్కన శావల్యాపురం జడ్పీ పాఠశాలకు ఎదురుగా ఆర్టీసీ బస్టాండ్, సెంటర్లో బస్‌షెల్టర్లను గతంలో నిర్మించారు. బస్టాండ్ గ్రామానికి ఆనుకొని ఉన్నప్పటికీ ప్రయాణికులు అక్కడవరకు వెళ్లి బస్సులు ఎక్కడానికి ఆసక్తి చూపకపోవడం, సెంటర్లోనే బస్సులు ఎక్కుతుండడంతో ప్రారంభించిన కొద్దిరోజుల్లోనే బస్టాండ్ మూతపడింది. కొనేళ్ళుగా బస్టాండ్ జన సంచారం లేక నిరుపయోగంగా ఉండడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయి ఆవరణ మొత్తం అధ్వానంగా మారింది. దాన్ని ఆసరాగా చేసుకొని కొంతమంది మందుబాబులు అక్కడ మద్యం సేవించి బాటిళ్ళు అక్కడే పడేస్తున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు. రెండు, మూడుసార్లు బస్టాండ్‌ను పునఃప్రారంభించి అక్కడ ప్రతి బస్సు ఆగేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకొన్నప్పటికీ ప్రయాణికులు అక్కడికి వెళ్ళకపోవడంతో చేసేదేమీలేక వారు కూడా మిన్నకుండిపోయారు. శావల్యాపురం నుండి వినుకొండకు 10కిమీ దూరంకావడంతో ప్రయాణికులు ఎక్కువగా ద్విచక్రవాహనాలు, ఆటోల్లో వెళుతుంటారు. నరసరావుపేట, గుంటూరు, విజయవాడ పట్టణాలు ఎక్కువ దూరం కావడంతో అక్కడకు వెళ్ళేందుకు ఎక్కువమంది బస్సులను ఆశ్రయిస్తుంటారు. కానీ శావల్యాపురం సెంటర్లోని బస్‌షెల్టర్ వినుకొండకు వెళ్ళే వైపున ఉండడంతో అది ప్రయాణికులకు ఏమాత్రం ఉపయోగపడడం లేదు. ఎండల్లో, వర్షాలు కురిసే సమయంలో ప్రయాణికులు రోడ్లపై బస్సుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకం ప్రారంభించినప్పటి నుంచి ప్రయాణికుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. బస్సులు వినుకొండ నుంచే నిండి వస్తుండడంతో ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపైనే నిలబడాల్సిన పరిస్థితి. కొన్ని బస్సులు శావల్యాపురంలో ఆపకుండానే వెళుతుండడంతో ప్రయాణికులు తీవ్ర నిరుత్సాహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆర్టీసీ భవనాలు వాడుకలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# మహిళల క్రికెట్‌పై సర్వత్రా ఆసక్తి

వినుకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళల క్రికెట్ జట్టు ఆటతీరుపై నియోకవర్గంలో సర్వత్రా ఆసక్తి కనబర్చారు. భారత మహిళల క్రికెట్ జట్టు ప్రతిష్ఠాత్మకమైన ఐసీసీ వరల్డ్ కప్‌లో ఫైనల్స్‌కు చేరుకుని, ఆదివారం రాత్రి ఫైనల్స్ ఆట జరగటంతో జట్టు ఘన విజయం సాధించాలని కోరుకుంటూ పట్టణంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో దేవాలయ పూజారులు, నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. భారత జట్టు వరల్డ్ కప్‌ను గెలవాలని స్వామి వారిని వేడుకున్నారు. అదేవిధంగా, పట్టణంలోని ప్రధాన మసీదుల్లో కూడా మత పెద్దలు, ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు, పట్టణంలోని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీడాకారిణులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.




గుంటి ఆంజనేయస్వామి దేవాలయంలో, ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చిలో మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న కూటమి నాయకులు

### భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణాఫ్రికాతో జరిగే మహిళల ఫైనల్ క్రికెట్ మ్యాచ్ వీక్షణకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు క్యాంపు కార్యాలయంలో ఆదివారం భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటుచేశారు. ఫైనల్ మ్యాచ్‌లో మన జట్టు దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించి దేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి ఆకాంక్షించారు. క్యాంపు కార్యాలయంలో మ్యాచ్ చూడడానికి తెలుగు మహిళలు, మహిళా కౌన్సిలర్లు తరలివచ్చారు.



స్తూపం సెంటర్‌లో ఏర్పాటుచేసిన బిగ్ స్క్రీన్

● వినుకొండ: మన దేశ మహిళ క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు వినుకొండ మున్సిపల్ ఛైర్మన్ షేక్ దస్తగిరి, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్, అధికారులు పట్టణంలోని స్తూపం సెంటర్‌లో ఆదివారం బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని కౌన్సిలర్ షకీలా దస్తగిరి ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో ఆసక్తిగా క్రికెట్‌ను వీక్షించారు.


పట్టణంలో ఉత్సవమూర్తుల గ్రామోత్సవం

## ఘనంగా శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి

నరసరావుపేట రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరాంపురం పొత్తులూరు వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామి వారి జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పెనుగొండ హనుమంతరావు, తాటికొండ బాబు, పొత్తూరి వరప్రసాదరావు, ఒరేటి రాజేంద్ర ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


శావల్యాపురంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సత్యకిరణ్

## 200మంది రోగులకు వైద్యపరీక్షలు

శావల్యాపురం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వినుకొండకు చెందిన విజయ నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో శావల్యాపురం రైల్వేస్టేషన్ మార్గంలోని పాత రైస్‌మిల్లు వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించింది. శావల్యాపురం చుట్టుపక్కల గ్రామాల నుంచి 200మంది రోగులు శిబిరానికి హాజరై వైద్యపరీక్షలు చేయించుకొన్నారు. డాక్టర్ సత్యకిరణ్ పాల్గొని రోగులకు షుగర్, బీపీ, థైరాయిడ్, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, లివర్, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రజలకు ఆరోగ్యపరమైన అంశాలు, పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు. శిబిరానికి సహకరించిన పెద్దలకు సత్యకిరణ్ కృతజ్ఞతలు తెలియజేశారు.


సంఘ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

## చర్చిలో మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థికసాయం

వినుకొండ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట రోడ్డులోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణానికి రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ వారు ఆర్థికసాయం ఆదివారం అందించారు. రోటరీ క్లబ్ కార్యవర్గం నిర్మాణాల ప్రదేశాన్ని సందర్శించి పనుల ప్రగతిని సమీక్షించింది. ఒక నెలలోపు పనులు పూర్తిచేసి భక్తుల వినియోగంలోకి తేవాలని సంకల్పించినట్లు చర్చి బాధ్యులు చాట్ల రామయ్య రోటరీ బృందానికి తెలిపారు. నిర్మాణ వ్యయంలో పాలుపంచుకుంటున్న రోటరీ క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమానికి ప్రధాన దాతలు మాజీ రోటరీ అధ్యక్షుడు గుమ్మా శ్రీకాంత్‌రెడ్డి, క్లబ్ రోటరీ ఫౌండేషన్ డైరెక్టర్ మస్తాన్, ఇతర సభ్యులు కొంతమంది సహకారం అందించారు. కార్యక్రమాలలో రోటరీ అధ్యక్షుడు యేరువ వెంకటనారాయణ, కార్యదర్శి బాజీ, రోటరీ జిల్లా ముఖ్యులు ఆలా శ్రీనివాసరావు, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, క్లబ్ సర్వీసెస్ డైరెక్టర్ నాగేంద్రుడు మాష్టారు, క్లబ్ యూత్ సర్వీసెస్ డైరెక్టర్ గుత్తా గురునాథం, మాజీ కోశాధికారి నాయబ్ రసూల్, క్లబ్ సభ్యులు దావులూరి శ్రీనివాసరావు, గుమ్మా అంజిరెడ్డి చర్చి పెద్దలు పాల్గొన్నారు.

## అయ్యప్ప భక్తుల శ్రీశైలం పాదయాత్ర

నూజెండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నూజెండ్ల నుంచి 12 మంది అయ్యప్ప దీక్షా స్వాములు ఆదివారం శ్రీశైలం పాదయాత్రగా బయలుదేరారు. అయ్యప్ప దీక్షలో భాగంగా శ్రీశైల పుణ్యక్షేత్రానికి పాదయాత్ర చేస్తున్నట్టు దీక్షా స్వాములు పేర్కొన్నారు. రోజుకు 40 కిలో మీటర్ల మేర నడిచే విధంగా ఏర్పాట్లు చేసుకున్నట్టు వారు పేర్కొన్నారు.


నూజెండ్ల నుంచి శ్రీశైలం బయలు దేరిన దీక్షా స్వాములు

# పాఠశాల పక్కన ప్రమాదకరంగా మురుగుకుంట

ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు


బీసీ కాలనీలో స్కూల్ పక్కన నిలిచిపోతున్న మురుగు

ఈపూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చెర్ల బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాల పక్కనే మురుగుకుంట ఉంది. వర్షంపడితే పాఠశాలలోకి నీరు వస్తోంది. మురుగు కుంట వలన ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నట్లు ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు అంటున్నారు. సైడ్ కాలువలు ఆక్రమించి పూడ్చివేయడం వలనే పాఠశాల వద్ద మురుగునీరు చేరి కుంటని తలపిస్తోంది. వర్షం పడితే పాఠశాలలోకి రోడ్డుపైకి నీరు చేరడం వలన చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని కాలనీ వాసులు వాపోతున్నారు. వినుకొండ నుంచి కారంపూడి వెళ్ళే ఆర్అండ్‌బీ రోడ్డుకు పక్కనే ఉండడం వలన తరచూ మురుగునీరు రోడ్డుపైకి వస్తోంది. అధికారులు స్పందించి గుంతను పూడ్పించి మురుగు లేకుండా చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


ఎంపికైన ఈతగాళ్లతో కోచ్ జి.సురేష్

## రాష్ట్రస్థాయి ఈత పోటీలకు 28మంది ఎంపిక

నరసరావుపేట కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రస్థాయిలో జరిగే ఈత పోటీలకు ఈతగాళ్ల ఎంపికకు ఆదివారం ఎస్ఎస్ఎన్ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 58మంది ఈతగాళ్లు పాల్గొనగా వారిలో 28మంది వివిధ కేటగిరీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వీరిలో సబ్ జూనియర్స్ కేటగిరిలో ఎంపికైన 10మంది ఈ నెల 16న విజయవాడలో జరిగే రాష్ట్ర మినీ జూనియర్స్ చాంపియన్ షిప్ పోటీలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. వింటర్ డిస్ట్రిక్ట్ కేటగిరికి ఎంపికైన 15మంది ఈతగాళ్లు ఈ నెల 22, 23 తేదీలలో విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. అలాగే మాస్టర్స్ కేటగిరికి ఎంపికైన ముగ్గురు ఈతగాళ్లు ఈ నెల 9న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి మాస్టర్స్ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొంటారని చెప్పారు. ఈ ఎంపికలు కోచ్ జి.సురేష్ ఆధ్వర్యంలో జరిగాయన్నారు. ఎంపికైన ఈతగాళ్లను పీడీఎస్ఏ అధ్యక్షుడు డాక్టర్ ఏవీవీ రామలింగారెడ్డి, కార్యదర్శి వైవీ సుబ్బారెడ్డి ఇతర అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

### నేడు అండర్ - 19 హ్యాండ్ బాల్ సెలక్షన్స్

హ్యాండ్ బాల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని చరితరెడ్డి డిఫెన్స్ అకాడమి ఆధ్వర్యంలో అండర్-19 హ్యాండ్ బాల్ సెలక్షన్స్ జరుగుతాయని అకాడమి నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనాల్సిందిగా కోరారు.

## నరసరావుపేట వాసి విజయవాడలో మృతి

విజయవాడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎస్‌కేబీఎన్ నగర్‌కు చెందిన వ్యక్తి విజయవాడ కృష్ణలంక పోలీసు స్టేషన్ పరిధిలో మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నరసరావుపేట ఎస్‌కేబీఎన్ నగర్‌కు చెందిన కట్టా గురవయ్య (55)కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. ఇతను నరసరావుపేటలో ఓల్డ్‌ఏజ్ హోమ్ నిర్వహిస్తున్నాడు. పెద్ద కుమార్తెను ఇబ్రహీంపట్నంలో ఉంటున్న యువకుడికి ఇచ్చి వివాహం చేశారు. ఆదివారం గురవయ్య, అతని భార్య ఇబ్రహీంపట్నంలో ఉన్న కుమార్తె వద్దకు వచ్చారు. గురవయ్య, అతని భార్య స్కూటీపై ఆదివారం వ్యక్తిగత పనులపై విజయవాడ వచ్చారు. సాయంత్రం పనులు ముగించుకుని ఇబ్రహీంపట్నం వెళుతుండగా విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన గవర్నరుపేట డిపో-1 సిటీ బస్సు గురవయ్య స్కూటీని ఢీకొంది. ఈ సంఘటనలో గురవయ్యకు తీవ్ర గాయాలు కాగా, అతని భార్యకు స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను గవర్నరుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గురవయ్య చికిత్స పొందుతూ చనిపోయాడు. సమాచారం తెలుసుకున్న కృష్ణలంక పోలీసులు ఆసుపత్రికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. గురవయ్య భార్య వద్ద వివరాలు తెలుసుకుని ఇబ్రహీంపట్నంలోని ఆమె కుమార్తెకు సమాచారం ఇచ్చారు. మృతుడు కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## కావూరులో మెగా వైద్య శిబిరం

● 350 మందికి వైద్య పరీక్షలు


వైద్య శిబిరంలో రోగులకు మందుల పంపిణీ

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం కావూరులో టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాటూరి ఆసుపత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 350మంది గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందచేశారు. కాటూరి ఆసుపత్రికి చెందిన సుమారు 60మంది డాక్టర్లు, సిబ్బంది శిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించారు. గ్రామానికి చెందిన కోడె మణిప్రసాద్, కోడె హనుమంతరావు, మద్దాలి రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించారు.

## ప్రజల దృష్టి మరల్చడానికే జోగి అరెస్టు: రజిని

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీసీ నాయకులపై ఇంత ద్వేషం ఎందుకు చంద్రబాబు నాయుడు గారు అంటూ జోగీ అరెస్టుపై స్పందిస్తూ మాజీ మంత్రి విడదల రజిని ఆదివారం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'మీ నకిలీ మద్యం రాకెట్ బట్టబయలైపోయింది. మీరు చేసిన తప్పు నుంచి తప్పించుకోవడానికి మా బీసీ నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్‌ను అక్రమంగా అరెస్టు చేయడం దారుణం. నకిలీ మద్యం తయారీ మీది, తయారు చేసిన వారు మీవారు, అమ్మేది మీ లిక్కర్ షాపుల్లో, బెల్టు షాపుల్లో, పర్మిట్ రూముల్లో. కానీ బురద మాత్రం మావాళ్లపై జల్లడం, అరెస్టులు చేయటం దారుణం. కాశీబుగ్గ తొక్కిసలాట, మొంథా తుపాన్లో రైతుల గోడు నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే కదా ఈ అక్రమ అరెస్టు! ప్రజలు అంతా గమనిస్తూనే ఉన్నారు' అని ఆమె తన ట్వీట్ లో పేర్కొన్నారు. అయితే రజిని ట్వీట్‌పై ఎక్స్‌లో పలువురు ఆసక్తికర కామెంట్లు పోస్ట్ చేశారు. జగనన్న అరెస్టు చేసిన అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర బీసీ కాదా అని ప్రశ్నించారు. కుల రాజకీయాలు మొదలెట్టారా అని అడిగారు. తప్పు చేసినవారు బీసీ అయితే అరెస్టు చేయకూడదా అని ప్రశ్నించారు. డ్రామాలు ఆపాలని కోరారు.

## మిర్చి పంటలను పరిశీలించిన లాం శాస్త్రవేత్తలు


సొలసలో వర్షాలకు దెబ్బతిన్న మిర్చి పంటను పరిశీలిస్తున్న లాం శాస్త్రవేత్తలు

యడ్లపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావానికి గురైన మిర్చి పొలాలను లాం శాస్త్రవేత్తలు డాక్టర్ జి.క్రాంతిరేఖ, డాక్టర్ రాధిక రమ్యల బృందం పరిశీలించింది. యడ్లపాడు, నాదెండ్ల మండలాల పరిధిలో సాగుచేసిన మిర్చి పంటలను క్షేత్రస్థాయి పరిశీలన చేసిన శాస్త్రవేత్తల బృందం పంటను రైతులకు పలు సూచనలు చేసింది. పైరులో వర్షపు నీరు నిలబడకుండా బయటకు పంపించాలన్నారు. మొక్కలు ఉరకెత్తి తలలు వాల్చినట్లయితే వెంటనే తేరుకునేందుకు లీటరు నీటిలో 10గ్రాముల యూరియా కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పైరుపై పిచికారీ చేయాలని, పక్కకు వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి పాదు చుట్టూ మట్టిని ఎగదోయాలన్నారు. మొక్కలు వడలినట్లయితే 5గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను లీటరు నీటిలో, ఇనుపధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనపడితే 50గ్రాముల అన్నభేది, ఒక నిమ్మచెక్క రసాన్ని కలిపి పిచికారీ చేయాలన్నారు. వీటితోపాటు పైపాటుగా ఎకరానికి 50కిలోల యూరియా, 250కిలోల వేపపిండి వేసుకోవాలని, నేల అరుదలకు వచ్చిన వెంటనే అంతర కృషి చేసుకోవాలన్నారు. మొక్కలు తేరుకున్న తరువాత స్థూల పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములు, సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని 2.5గ్రాములు లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో 2 నుంచి 3సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. వారితో చిలకలూరిపేట ఉద్యాన అధికారి శ్రీలక్ష్మి, గ్రామ ఉద్యాన సహాయకులు, ఎంపీటీసీ సభ్యుడు ఎం.శ్రీనివాసరెడ్డి, రైతులు ఉన్నారు.